RNI No: TELTEL/2022/83073

వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:139 | మే 29, 2026 | వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260

అపాయింటెడ్ డే ప్రకటించాలి

- జూన్ ఒకటిన ఇందిరాపార్క్ వద్ద నిరసన
- తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ నాయకులు

సమగ్ర సంక్షేమ కార్డు!

ప్రతి పథకం వివరాలు ఒకే కార్డులో..

- లబ్ధిదారుల డేటా సేకరణకు ప్రత్యేక చర్యలు
- కృత్రిమ మేధస్సుతో సంక్షేమ పథకాల విశ్లేషణ
- ఒకే కార్డుతో అన్ని శాఖల సేవలు
- ఆరోగ్యశ్రీ నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ వరకు అనుసంధానం
- కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాల సేకరణ
- గల్ఫ్ కార్మికులకు ప్రత్యేక సమాచార వేదిక
- సంక్షేమ ఫలాలు అర్హులకు చేరేలా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

వేద న్యూస్, హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో అందుబాటులో ఉండేలా సమగ్ర సంక్షేమ కార్డును రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద ఎంత మేర లబ్ధి అందుతోందో స్పష్టంగా కని పించే విధంగా ఈ కార్డు ఉండాలని సూచిం చారు. దీనికోసం అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల వివరాలను సేకరించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని సీఎం ఆదేశించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి తదితర ఉన్నతాధికారులతో జరిగిన సమీక్షలో ఈ అంశంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా

మిగతా 2వ పేజీలో

టీఆర్ఎస్‌లోకి మాజీ మంత్రి బోడ జనార్దన్

- కండువా కప్పి ఆహ్వానించిన పార్టీ చీఫ్ కవిత
- కార్మికులను ప్రభుత్వం మోసం చేస్తోందని ఫైర్

ఢిల్లీ వైపు చూస్తే.. గల్లీలో గండమేనా?!

ప్రాంతీయతను వీడితే పతనం తప్పదు

- సొంత గడ్డను కాదని జాతీయ పీఠంపై కన్నేస్తే భంగపాటే
- ఒక్కసారి సీఎం అయితే ఢిల్లీవైపు చూడాల్సిందేనా?
- ఇటీవలి రేవంత్ మాటలపై రాజకీయాల్లో సరికొత్త చర్చ
- కేసీఆర్ పరిస్థితి తప్పదంటున్న విశ్లేషకులు
- తొలి టర్మ్‌లోనే జాతీయ ఆశను బయటపెట్టిన రేవంత్ రెడ్డి
- సొంత పార్టీలోనే పవర్ సెంటర్లు, గ్రూపు రాజకీయాలు
- జాతీయ పార్టీ అండ ఉన్నా.. అంతర్గత సవాళ్లే కీలకం
- గతంలో అటుగా చూసిన ఇతర రాష్ట్ర నేతలు ఇప్పుడు ఏమయ్యారు?
- తెలంగాణ ప్రజల నాడి ప్రత్యేకం అంటున్న మేధావులు

వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి (ఎల్.కే)

తెలంగాణ రాజకీయాల్లో అధికారం దక్కించుకున్న ఏ నాయకుడికైనా ఢిల్లీ పీఠం ఒక తీపి కలగా మారుతోంది. అయితే, ప్రాంతీయ సెంటిమెంట్‌తో ఎదిగిన నేతలు వ్యక్తిగత ప్రతిష్ఠ కోసం తమ మూలాలను వీడితే భవిష్యత్తులో నిలబడగలరా? అన్న చర్చ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. నాడు కేసీఆర్, నేడు రేవంత్ రెడ్డి.. ఇద్దరి దారులు వేరైనా లక్ష్యం మాత్రం 'ఢిల్లీ పీఠమే'. జాతీయ రాజకీయాల మోజుతో టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి, సొంత గడ్డపై కేసీఆర్ పట్టు కోల్పోయిన ఉదంతం అందరికీ తెలిసిందే. కాగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవి చేపట్టిన కొద్ది కాలానికే తన జాతీయ ఆకాంక్షలను బయటపెడుతూ.. 2034 తర్వాతే జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానని ప్రకటించడం సాహసమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. కేసీఆర్ పతనం నుంచి పాఠాలు నేర్చుకుని, రేవంత్ రెడ్డి ముందుగా తెలంగాణ ప్రజలను సంపూర్ణంగా మెప్పిస్తూ గల్లీని గెలిస్తేనే.. ఢిల్లీ కల సాకారమవుతుందని, లేదంటే అది కేవలం కలగానే మిగిలిపోతుందని రాజకీయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

బూడిదైన రైతన్న కష్టం..

- ఇంచెంచెర్వుపల్లిలో అగ్నిప్రమాదం
- పంట పొలాలు, మోటార్లు దగ్ధం
- రైతులను కన్నీరు పెట్టించిన ఘటన
- ప్రభుత్వం సాయం చేయాలని వేడుకోలు

వేద న్యూస్, వెంకటాపూర్

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం ఇంచెంచెర్వుపల్లి గ్రామం లో జరిగిన అగ్నిప్రమాదం రైతులను తీవ్ర విషాదంలో ముంచింది. చిన్నపాటి మంటలు క్షణాల్లోనే వ్యాపించి పంట పొలాలు, మోటార్లు, వరిగడ్డి కట్టలను బూడిద చేశాయి. గురువారం మధ్యాహ్నం గ్రామ శివారులో ప్రారంభమైన మంటలు గాలి ఉధృతికి వేగంగా వ్యాపించి దాదాపు ఐదు ఎకరాల పండిన వరి పంట పూర్తిగా దగ్ధమైంది. మూడు బోరు మోటార్లు, స్టార్టర్లు, పైపులైన్లు, వందల సంఖ్యలో వరిగడ్డి కట్టలు అగ్నికి ఆహుతయ్యాయి. పశువులకు వేయాల్సిన గడ్డి కూడా కాలిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో సుమారు రూ.15 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. మంటలు గ్రామం వైపు దూసుకురావడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. యువ రైతు కామా అశోక్ అప్రమత్తమై వెంటనే అత్యవసర సేవలకు సమాచారం అందించడంతో పాటు గ్రామ యువకులు, రైతులు కలిసి మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. వారి సకాలంలో స్పందన వల్లే పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. 'చేతికి అందిన పంట కళ్లముందే కాలిపోతుంటే తట్టుకోలేక పోతున్నాం' అంటూ బాధిత రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పెట్టిన పెట్టుబడి మొత్తం నష్టపోయామని, పశువులకు మేత కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి సీతక్కతో పాటు ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులకు తక్షణ ఆర్థిక సాయం అందించాలని బాధితులు వేడుకుంటున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులను ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజాపాలన

- తెలంగాణను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హైదరాబాద్‌లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా!

- డీకే శివకుమార్‌కు మార్గం సుగమం
- బెంగళూరులో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు
- కర్ణాటకలో కీలక రాజకీయ పరిణామం

వేద న్యూస్

శుక్రవారం | మే 29, 2026

త్యాగానికి, ప్రేమకు ప్రతిరూపం బక్రీద్

మంత్రి కొండా సురేఖ

వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి

మైనార్టీల సంక్షేమానికి, అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తెలిపారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని వరంగల్ నగరంలోని ఎల్బీనగర్, మట్టేవాడ, ఫోర్ట్ వరంగల్ ఈద్గాలలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి కొండా సురేఖతో పాటు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, ఈద్గా కమిటీ సభ్యులు మంత్రి కొండా సురేఖ, కొండా మురళీధర్ రావును శాలువాలతో సత్కరించి ఘనంగా గౌరవించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి, విశ్వాసానికి, అల్లాహ్‌కు విధేయతకు ప్రతీక అని పేర్కొన్నారు. తమ కుటుంబ సభ్యులుగా భావించి ఈద్గా ప్రార్థనలకు ఆహ్వానించిన ముస్లిం మత పెద్దలకు, కమిటీ సభ్యులకు, ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మైనార్టీలకు కల్పించిన రిజర్వేషన్ల ద్వారా ఎంతోమంది ముస్లింల జీవితాల్లో మార్పు వచ్చిందని తెలిపారు.ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. విద్య, ఉపాధి, ఆరోగ్య రంగాల్లో మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమాజంలో శాంతి, సామరస్యాలు నెలకొనాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అల్లాను ప్రార్థించిన మంత్రి సురేఖ, తెలంగాణ రాష్ట్రంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ముస్లిం సోదర సోదరీమణులందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

జూనియర్ అడ్వకేట్లకు మూడు రోజుల ఉచిత శిక్షణా శిబిరం

- పీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ
- శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన జస్టిస్ సూరెపల్లి నంద

వేద న్యూస్, హైదరాబాద్

జూనియర్ న్యాయవాదుల కోసం మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఉచిత శిక్షణా వర్క్‌షాప్‌ను తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ సూరెపల్లి నంద ప్రారంభించారు. పీఆర్ ఫౌండేషన్ ఫర్ సొసైటీ వెల్‌నెస్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన జస్టిస్ సూరెపల్లి నంద యువ న్యాయవాదులను ఉద్దేశించి ప్రసంగించారు. న్యాయవాదులు తమ వృత్తిలో నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా హైకోర్టు సీనియర్ అడ్వొకేట్ రఘునాథ్ వెరోస్ క్రిమినల్ లా, బెయిల్ చట్టాలు, జీవన హక్కు, స్వేచ్ఛ, వాదనలో నైపుణ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. యువ న్యాయవాదులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి పలు సూచనలు చేశారు. బార్ అసోసియేషన్ సీనియర్ సభ్యులు జె. ప్రభాకర్ యువ న్యాయవాదుల కెరీర్ నిర్మాణానికి అవసరమైన అడ్వొకసీ నైపుణ్యాలపై మాట్లాడగా, అడ్వొకేట్ శ్రీనివాస్ పొడిచేటి సివిల్ ప్రొసీజర్ కోడ్, అప్పీలు, సివిల్ రివిజన్ పిటిషన్లపై వివరించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఎన్నికైన సభ్యుడు డి. రాఘవులు మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో విజయవంతం కావడానికి అవసరమైన అంశాలపై సూచనలు చేశారు. మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో తొలి రోజు విజయవంతంగా ముగిసిందని నిర్వాహకులు, పీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పోనంపల్లి రవి తెలిపారు. యువ, జూనియర్ అడ్వొకేట్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యువ న్యాయవాదులు, జూనియర్ అడ్వొకేట్లు, న్యాయ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అపాయింటెడ్ డే ప్రకటించాలి

వేద న్యూస్, తెలంగాణ బ్యూరో

ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లుగా అపాయింటెడ్ డే ప్రకటించాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జూన్ ఒకటో తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సామూహిక దీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూనియన్ నాయకులు వెల్లడించారు. యూనియన్ ఎన్నికలకు ముందుగానే ఉద్యోగుల విలీన ప్రక్రియ పూర్తి చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. 2026 మే ఒకటో తేదీ నుంచి అపాయింటెడ్ డే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అపాయింటెడ్ డే కంటే ముందుగా యూనియన్ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రకటించడంతో ఉద్యోగుల్లో అయోమయం నెలకొందని అభిప్రాయపడ్డారు. జూన్ ఒకటో తేదీ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఇందిరాపార్క్ వద్ద దీక్ష నిర్వహించనున్నట్లు తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక రాష్ట్ర కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ తెలిపారు. ప్రభుత్వంలో విలీనం కోరుకునే ఉద్యోగులంతా యూనియన్లకు అతీతంగా ఈ దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షకు తెలంగాణ ఆర్టీసీ కార్మిక సమాఖ్య కూడా మద్దతు ప్రకటించింది. యాజమాన్యం వద్ద పరిష్కారం కావాల్సిన ఇరవై తొమ్మిది సమస్యలపై చర్చలు కొనసాగుతున్న సమయంలో ఎన్నికలకు వెళ్లడం వల్ల కార్మికులు నష్టపోతారని కార్మిక సమాఖ్య నాయకుడు రాజిరెడ్డి పేర్కొన్నారు.

ఢిల్లీ వైపు చూస్తే.. గల్లీలో గండమేనా?!

ప్రాంతీయతను వీడితే పతనం తప్పదు

- సొంత గడ్డను కాదని జాతీయ పీఠంపై కన్నేస్తే భంగపాటే
- ఒక్కసారి సీఎం అయితే ఢిల్లీవైపు చూడాల్సిందేనా?
- ఇటీవలి రేవంత్ మాటలపై రాజకీయాల్లో సరికొత్త చర్చ
- కేసీఆర్ పరిస్థితి తప్పదంటున్న విశ్లేషకులు
- తొలి టర్మ్‌లోనే జాతీయ ఆశను బయటపెట్టిన రేవంత్ రెడ్డి
- సొంత పార్టీలోనే పవర్ సెంటర్లు, గ్రూపు రాజకీయాలు
- జాతీయ పార్టీ అండ ఉన్నా.. అంతర్గత సవాళ్లే కీలకం
- గతంలో అటుగా చూసిన ఇతర రాష్ట్ర నేతలు ఇప్పుడు ఏమయ్యారు?
- తెలంగాణ ప్రజల నాడి ప్రత్యేకం అంటున్న మేధావులు

వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి (ఎల్.కే)

తెలంగాణ రాజకీయాల్లో అధికారం దక్కించుకున్న ఏ నాయకుడికైనా ఢిల్లీ పీఠం ఒక తీపి కల. ప్రాంతీయ పార్టీల మనుగడకు, ప్రాంతీయ నేతల భవిష్యత్తుకు సంబంధించిన భారత రాజకీయాల్లో ఇప్పుడొక సరికొత్త చర్చ మొదలైంది. సొంత రాష్ట్ర ప్రజల ఆకాంక్షలతో, ప్రాంతీయ సెంటిమెంట్‌తో ఎదిగిన పార్టీలు లేదా నాయకులు.. కేవలం వ్యక్తిగత ప్రతిష్ఠ, జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలనే ఆరాటంతో తమ మూలాలను (ప్రాంతీయతను) వీడితే భవిష్యత్తులో నిలబడగలరా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నిన్న కేసీఆర్.. నేడు రేవంత్ రెడ్డి.. ఇద్దరి దారులు వేరైనా లక్ష్యం మాత్రం ఒకటే.. అది 'ఢిల్లీ పీఠం'.

ప్రాంతీయతను వీడితే దెబ్బే!

ప్రత్యేక తెలంగాణ ఉద్యమమే శ్వాసగా ఆవిర్భవించిన నాటి 'తెలంగాణ రాష్ట్ర సమితి' కేవలం ఆ ప్రాంతీయ సెంటిమెంట్‌తోనే రెండు సార్లు తిరుగులేని అధికార పీఠాన్ని దక్కించుకుంది. అయితే, కేసీఆర్ తన రెండో విడత పాలన చివరలో జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలనే బలమైన కోరికతో టీఆర్ఎస్ పేరును 'భారత రాష్ట్ర సమితి'గా మార్చేశారు. ఎప్పుడైతే పార్టీ పేరులోంచి 'తెలంగాణ' అనే పదం పోయిందో, ఎప్పుడైతే 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' అంటూ కేసీఆర్ మహారాష్ట్ర, కర్ణాటక వంటి ఇతర రాష్ట్రాలపై ఫోకస్ పెట్టారో.. అప్పుడే తెలంగాణ ఓటర్లు మానసికంగా ఆయనకు దూరం కావడం మొదలైంది. సొంత రాష్ట్రంలోని ప్రధాన సమస్యలు, ప్రజల భావోద్వేగాలను పక్కనపెట్టి జాతీయ రాజకీయాలపై ఎక్కువ దృష్టి పెట్టడం వల్ల కాంగ్రెస్, బీజేపీ వంటి జాతీయ పార్టీల మధ్య బీఆర్ఎస్ తన ప్రత్యేకతను కోల్పోయింది. చివరకు జాతీయ రాజకీయాల మాట దేవుడెరుగు.. సొంత ఇలాకాలోనే కేసీఆర్ పట్టు కోల్పోయి అధికారాన్ని వదులుకోవాల్సి వచ్చింది. ప్రజలకు దగ్గరగా ఉండి, ప్రాంతీయ అంశాలపై పోరాడిన పార్టీలకే ఆదరణ లభిస్తుందని ఇటీవలి ఎన్నికల ఫలితాలు కూడా స్పష్టం చేశాయి.

రేవంత్ ఆశలు సాహసమేనా?

కేసీఆర్ పదేళ్ల పాలన తర్వాత, అదీ వ్యతిరేకత మొదలైన తరుణంలో జాతీయ రాజకీయాల గురించి మాట్లాడారు. కానీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం తన మొదటి విడత పాలనలోనే.. అది కూడా పదవి చేపట్టిన కొద్ది కాలానికే తన జాతీయ ఆకాంక్షలను బహిరంగంగానే వ్యక్తపరిచారు. నేను 2034 వరకు రాష్ట్రంలో నేనే సీఎంను.. ఆ తర్వాతే జాతీయ రాజకీయాల్లోకి వెళ్తాను అని చెప్పడం ద్వారా ఆయన తన కేడర్‌లో స్థిరత్వాన్ని నింపాలని చూస్తున్నారు. అయితే, పాలన ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్న తరుణంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా సాహసమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి దృష్టి రాష్ట్ర పాలన, ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు మీద ఉందా.. లేక వ్యక్తిగత ఎదుగుదలపై ఉందా? అని ప్రజలు ప్రశ్నించే అవకాశం ఉంది. తెలంగాణ సమాజం ఎప్పుడూ తమ నాయకుడు తమ కోసమే పనిచేయాలని కోరుకుంటుంది. తమ సీఎం నిరంతరం ఢిల్లీ పర్యటనలకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని ప్రజలు భావిస్తే, అది రాజకీయంగా పెద్ద డ్యామేజ్ కలిగిస్తుంది.

ఇద్దరి ఆలోచనలకు తేడా ఏంటి?

కేసీఆర్ శూన్యం నుంచి ఒక జాతీయ వేదికను నిర్మించాల్సి వచ్చింది. ఇతర రాష్ట్రాల్లో క్యాడర్ లేదు, బలమైన నెట్‌వర్క్ లేదు. కానీ రేవంత్ రెడ్డికి ఉన్న అతిపెద్ద సానుకూలత కాంగ్రెస్ అనే బలమైన జాతీయ పార్టీ అండ. ఆయన కేవలం ఉన్న పార్టీలోనే తన స్థాయిని పెంచుకుంటే సరిపోతుంది. బీఆర్ఎస్ అనేది కేసీఆర్ కుటుంబం చుట్టూ తిరిగే పార్టీ. అక్కడ నిర్ణయాధికారం ఒక్కరిదే. కానీ కాంగ్రెస్ అలా కాదు. ఇక్కడ అంతర్గత ప్రజాస్వామ్యంతో పాటు గ్రూపు రాజకీయాలు కూడా ఎక్కువే. రేవంత్ రెడ్డికి సొంత పార్టీలోనే బలమైన ప్రత్యర్థులు, సీనియర్లు ఉన్నారు. జాతీయ స్థాయికి ఎదగాలంటే ఆయన కేవలం ప్రతిపక్షాలనే కాదు, పార్టీలోని ఇతర పవర్ సెంటర్లను కూడా అధిగమించాల్సి ఉంటుంది.

గత చరిత్ర ఏం చెబుతోంది?

భారత రాజకీయ చరిత్రను పరిశీలిస్తే.. ప్రాంతీయతను వీడి లేదా సొంత రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేసి ఢిల్లీ వైపు కన్నెత్తి చూసిన చాలామంది ప్రాంతీయ నేతలకు భంగపాటే ఎదురైంది. గతంలో తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు చెందిన పలువురు బలీయమైన ప్రాంతీయ నేతలు జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని చూసినప్పుడు.. సొంత రాష్ట్రాల్లోని ప్రత్యర్థులు పుంజుకుని వారిని దెబ్బకొట్టారు. ఢిల్లీ పీఠంపై ఆశతో సొంత గడ్డపై పట్టు కోల్పోయిన ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. జాతీయ రాజకీయాలు అనుకున్నంత ఈజీ కాదనేది చారిత్రక సత్యం.

గల్లీ గెలిస్తేనే.. ఢిల్లీ

రేవంత్ రెడ్డికి జాతీయ పార్టీ నేపథ్యం ఉన్న మాట వాస్తవమే అయినా.. రాజకీయాల్లో ప్రజా తీర్పు అత్యంత శక్తివంతమైనది. రేవంత్ రెడ్డి 2034 లక్ష్యం నెరవేరాలన్నా, ఆయన జాతీయ నాయకుడిగా ఎదగాలన్నా.. ముందుగా తెలంగాణలో తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలి. ఒకవేళ సంక్షేమ పథకాల అమలులో, పాలనలో విఫలమైతే రెండోసారి ముఖ్యమంత్రి అయ్యే అవకాశమే ఉండదు. అప్పుడు 2034 లక్ష్యం అనేది కేవలం కలగానే మిగిలిపోతుంది. కేసీఆర్ పతనం నుంచి నేర్చుకోవాల్సిన అతిపెద్ద పాఠం ఇదే. రేవంత్ రెడ్డి తన పాలనతో ముందుగా ఇక్కడి ప్రజలను సంపూర్ణంగా మెప్పిస్తూ, ఆ తర్వాతే ఢిల్లీ వైపు అడుగులు వేయాల్సి ఉంటుంది. సొంత గడ్డను నిర్లక్ష్యం చేసి ఢిల్లీ వైపు కన్నెత్తి చూస్తే.. ఓడిపోతారనేది జగమెరిగిన సత్యం.

టీఆర్ఎస్‌లోకి మాజీ మంత్రి బోడ జనార్ధన్

వేద న్యూస్, హైదరాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బోడ జనార్ధన్ తన అనుచరులతో కలిసి టీఆర్ఎస్ పార్టీలో చేరారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, తెలంగాణ అభివృద్ధిపై కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ సబ్బండ తెలంగాణ వర్గాల గతి మార్చే సమగ్ర అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే ఆ ప్రణాళికను ప్రకటిస్తామని వెల్లడించారు. తాము తీసుకురాబోయే కార్యక్రమాలు తెలంగాణలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తాయని పేర్కొన్నారు. ప్రశ్నించడం, పోరాడటం, సమస్యలను పరిష్కరించడం అనే విధానంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. బోడ జనార్ధన్ వంటి అనుభవజ్ఞుడైన నాయకుడు పార్టీలో చేరడం టీఆర్ఎస్‌కు మరింత బలం చేకూరుస్తుందని కవిత పేర్కొన్నారు. కార్మిక శాఖ మంత్రిగా, ఆర్టీసీ ఛైర్మన్‌గా పనిచేసిన జనార్ధన్ సింగరేణి, ఆర్టీసీ కార్మికుల కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన అనుభవాన్ని పార్టీ ప్రజా ఉద్యమాలకు ఉపయోగించుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి, ఆర్టీసీ కార్మికులను ఘోరంగా మోసం చేస్తోందని కవిత ఆరోపించారు. మినిమమ్ వేతనాల పేరుతో కార్మికులకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పి రెండున్నరేళ్లుగా అమలు చేయకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో కార్మికులు, రైతులు, బడుగు బలహీన వర్గాల సమస్యలపై తమ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని కవిత స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను ఎత్తిచూపి పరిష్కారం సాధించే వరకు వెనక్కి తగ్గబోమన్నారు. సింగరేణి, ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మరింత బలంగా పోరాడుతామని తెలిపారు. మాజీ మంత్రి బోడ జనార్ధన్ మాట్లాడుతూ మహిళా నాయకురాలిగా కవిత పార్టీ ఏర్పాటు చేసి ప్రజా సమస్యల కోసం ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎన్టీఆర్, కేసీఆర్ తర్వాత ప్రజా సమస్యలపై స్పష్టమైన దృష్టితో కవిత ముందుకు వెళ్తున్నారని అన్నారు. టీఆర్ఎస్‌ను బలోపేతం చేయడానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమగ్ర సంక్షేమ కార్డు!

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి మాట్లాడుతూ సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ వివరాలు ఒకే చోట అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ సమాచారాన్ని కృత్రిమ మేధస్సు సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు జారీ చేసే విధానానికి బదులుగా సమాచార సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో ఒకే సమగ్ర కార్డు ఉండాలని సూచించారు. ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యాశాఖ, బీమా పథకాల వివరాలను ఈ కార్డుతో అనుసంధానం చేయాలని తెలిపారు. ఇటీవల నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను కూడా ఈ కార్డుతో అనుసంధానం చేయాలని సీఎం ఆదేశించారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలను సేకరించాలని ఐటీ శాఖకు సూచించారు. ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ ద్వారా ప్రభుత్వ సేవలు మరింత సమర్థవంతంగా అందించవచ్చని సీఎం పేర్కొన్నారు. మరణ ధృవీకరణ పత్రం జారీ అయిన వెంటనే సంబంధిత సంక్షేమ పథకాల డేటాబేస్‌కు సమాచారం చేరేలా వ్యవస్థ ఉండాలని తెలిపారు. ప్రజల ఆరోగ్య వివరాలను కూడా సమగ్ర సంక్షేమ కార్డుతో అనుసంధానం చేయాలని సూచించారు. గల్ఫ్ దేశాలకు వలస వెళ్లే కార్మికుల విషయంలో కేరళ అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, పాస్‌పోర్టులు, వీసాలకు సంబంధించిన సమాచారాన్ని ఒకే వేదికపై అందుబాటులో ఉంచితే అనధికార ఏజెంట్ల ప్రభావం తగ్గుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా ఈ సమగ్ర సంక్షేమ కార్డు ఉపయోగపడాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజాపాలన

వేద న్యూస్, తెలంగాణ బ్యూరో

ఉక్కు మహిళ ఇందిరా గాంధీ, తెలుగుజాతి గర్వించదగిన నాయకుడు నందమూరి తారక రామారావు స్ఫూర్తితో రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ అమీర్‌పేట్ మైత్రివనం చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహాన్ని ఆయన గురువారం ఆవిష్కరించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ దేశ చరిత్రను చదవాలన్నా, స్ఫూర్తి పొందాలన్నా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఇందిరా గాంధీ, ఎన్టీఆర్‌లను స్మరించుకోవాలని అన్నారు. ఈ దేశం ఉన్నంతకాలం వారి కీర్తి ప్రతిష్టలు నిలిచిపోతాయని పేర్కొన్నారు. ప్రజా సేవలో వారి పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. ఎన్టీఆర్ నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన నాయకుడని ముఖ్యమంత్రి అభివర్ణించారు. కులాలు, మతాలు, భాషలకు అతీతంగా ప్రజల మనసుల్లో నిలిచిన నాయకుడని అన్నారు. తెలంగాణ నుంచి అనేక మంది నాయకులకు ఎన్టీఆర్ రాజకీయ భిక్ష పెట్టారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకే ఈ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ముప్పై వేల ఎకరాల్లో ప్రతిష్టాత్మక భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ప్రపంచ దిగ్గజ సంస్థలను తెలంగాణకు తీసుకురావడంతో పాటు యువతను ఆ సంస్థల యజమానులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో మూడు కోట్ల ఇరవై నాలుగు లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా!

వేద న్యూస్, నేషనల్ బ్యూరో

కర్ణాటక రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేశారు. అధికారిక నివాసం "కావేరి"లో నిర్వహించిన అల్పాహార సమావేశంలో తన నిర్ణయాన్ని మంత్రివర్గ సహచరులకు వెల్లడించినట్లు సమాచారం. గవర్నర్ నగరంలో అందుబాటులో లేకపోవడంతో రాజీనామా లేఖను గవర్నర్ కార్యాలయానికి పంపించినట్లు తెలిపారు. సిద్ధరామయ్య రాజీనామాతో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదుపరి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ అధిష్ఠానం సూచనల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సిద్ధరామయ్య తన సహచరులకు వెల్లడించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా తాను పదవి నుంచి తప్పుకుంటున్నానని ఆయన పేర్కొన్నారు. సిద్ధరామయ్య రాజీనామా వార్త వెలువడగానే బెంగళూరులోని సదాశివనగర్‌లో ఉన్న డీకే శివకుమార్ నివాసం వద్ద సంబరాలు మొదలయ్యాయి. ఆయన అనుచరులు, అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకుని మిఠాయిలు పంచుకుంటూ నినాదాలు చేశారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. రాజీనామా అనంతరం మీడియాతో మాట్లాడిన సిద్ధరామయ్య, పార్టీ అధిష్ఠానం ఆదేశాలను గౌరవిస్తూ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు.

వేద న్యూస్

శుక్రవారం మే 29 , 2026

రెచ్చిపోతున్న మట్టి మాఫియా!

- బక్రీద్ సెలవులో యథేచ్ఛగా అక్రమ రవాణా
- చెరువుల నుంచి భారీగా మట్టి తరలింపు
- చూసీచూడనట్లు అధికారులు
- సహజ వనరులను కాపాడాలని స్థఆనికుల డిమాండ్ డిమాండ్

వేద న్యూస్, బోయినిపల్లి:

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో అక్రమ మట్టి రవాణా యథేచ్ఛగా కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రింబవళ్లు టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల నుంచి మట్టిని తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. మండలంలోని దుంద్రపల్లి గ్రామ పరిధిలో చెరువులోని మట్టిని భారీ లారీల్లో లోడ్ చేసి తరలిస్తున్నా రెవెన్యూ యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని గ్రామస్థులు ఆరోపించారు. ఈరోజు బక్రీద్ జాతీయ సెలవు దినం అయినప్పటికీ, ఇదే అవకాశంగా భావించిన మట్టి మాఫియా అక్రమ రవాణాను మరింత పెంచిందని తెలిపారు. ప్రకృతి సంపదైన మట్టిని అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని విమర్శించారు. అధికారులు స్పందించకపోవడంతో మట్టి మాఫియా మరింత రెచ్చిపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని సీపీఎం పార్టీ నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ మాట్లాడుతూ, ఇప్పటికైనా అధికారులు మొద్దు నిద్ర వీడి అక్రమ మట్టి రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతాంగం, గ్రామాల భవిష్యత్తు కోసం ప్రకృతి వనరులను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

కారేపల్లిలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి

వేద న్యూస్, కారేపల్లి:

తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి, మహానేత స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలను కారేపల్లి మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్ మాట్లాడుతూ తెలుగు ప్రజల గౌరవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పిన మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. "సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు" అనే సిద్ధాంతంతో ప్రజాసేవ చేసిన నాయకుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. పేదల సంక్షేమం కోసం ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు నేటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని పేర్కొన్నారు. యువత ఎన్టీఆర్ జీవితం నుంచి సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు గుగులోత్ రాజేష్ నాయక్, గుగులోత్ కిరణ్ కుమార్, దసానియా ఉపేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

- వ్యవసాయ అధికారి జై సింగ్

వేద న్యూస్, నడికూడ:

మండలంలోని రైతులకు రాబోయే వానాకాలం పచ్చిరొట్ట సాగుకు అవసరమైన జీలుగ విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి పోరిక జై సింగ్ తెలిపారు. నడికూడ మండలం నార్లాపూర్ గ్రామంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో 150 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 30 కిలోల జీలుగ విత్తన సంచి ధర రూ.4,905 కాగా, ప్రభుత్వం అందిస్తున్న 50 శాతం సబ్సిడీతో రైతులు కేవలం రూ.2,452 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒక 30 కిలోల సంచి రెండున్నర ఎకరాల సాగుకు సరిపోతుందని చెప్పారు. జీలుగ విత్తనాలు కావలసిన రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి పోరిక జై సింగ్ కోరారు.

ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు

వేద న్యూస్, సింగరేణి:

పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా సింగరేణి మండలంలోని ముస్లిం సోదరులకు కారేపల్లి గ్రామ సర్పంచ్ మేదరి టోనీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగం, సేవాభావం, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, పరస్పర గౌరవంతో జీవించాలనే సందేశాన్ని ఈ పండుగ అందిస్తుందని తెలిపారు. ముస్లిం సోదరులు ఆనందోత్సాహాల మధ్య బక్రీద్ వేడుకలు జరుపుకోవాలని, ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు నెలకొనాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ మత సామరస్యాన్ని కాపాడుతూ ప్రేమాభిమానాలతో ముందుకు సాగాలని మేదరి టోనీ పిలుపునిచ్చారు.

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి

- నాగ్సాన్‌పల్లి శివారులో విషాద ఘటన

వేద న్యూస్, పాపన్నపేట:

చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి శివారులోని చెలిమకుంటలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన గుండు కిష్టయ్య (48) వ్యవసాయంతో పాటు చేపలు పట్టుతూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం చేపలు పట్టేందుకు వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరాడు. చెలిమకుంట చెరువులో చేపలు పడుతుండగా కాళ్లకు వల చుట్టుకోవడంతో ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. గురువారం ఉదయం చెరువు వద్దకు వెళ్లిన స్థానికులు నీటిలో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వామ్మో.. రాత్రి ప్రయాణం!

- ఎల్ఈడీ లైట్లతో నరకంగా మారిన రోడ్లు
- హైబీమ్‌లతో పెరుగుతున్న ప్రమాదాలు
- ఆర్టీవో, పోలీసుల పర్యవేక్షణ కరువు
- చర్యలు తీసుకోవాలని వాహనదారుల డిమాండ్

వేద న్యూస్, వేములవాడ రూరల్:

రాత్రి వేళ రోడ్లపై జరుగుతున్న ప్రమాదాలకు వాహనాలకు అక్రమంగా అమర్చుతున్న అధిక ప్రకాశవంతమైన ఎల్ఈడీ లైట్లే ప్రధాన కారణమవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు అమర్చుతున్న హై పవర్ ఎల్ఈడీ లైట్ల వల్ల ఎదురుగా వచ్చే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి 7 గంటల తర్వాత వాహనాలు నడపాలంటేనే భయంగా మారిందని పలువురు డ్రైవర్లు చెబుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాల ఎల్ఈడీ లైట్ల వెలుగుతో కళ్లు మసకబారిపోతున్నాయని, కొన్ని క్షణాలు ఏమీ కనిపించకుండా పోతుందని వాపోతున్నారు. కొత్తగా వస్తున్న వాహనాల్లో అధిక ప్రకాశవంతమైన ఎల్ఈడీ లైట్లు అమర్చడం సాధారణమైపోయిందని, ఆర్టీవో అధికారుల పర్యవేక్షణ పూర్తిగా తగ్గిపోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో హెడ్‌లైట్లకు సగం వరకు బ్లాక్ స్టిక్కర్ తప్పనిసరి అనే నిబంధన ఉండేదని, ఇప్పుడు ఆ రూల్ అమలులో ఉందో లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. కనీసం హెడ్‌లైట్లకు బ్లాక్ స్టిక్కర్ లేదా బ్లాక్ పెయింట్ వేసే విధానాన్ని తిరిగి అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎల్ఈడీ లైట్ల వెలుగులతో..

ఎల్ఈడీ లైట్ల వెలుగు కళ్లపై నేరుగా పడటంతో 4 నుంచి 5 సెకన్ల పాటు ఎదుటివారికి ఏమీ కనిపించకుండా పోతుందని, ఆ సమయంలోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనం ఎంత దూరంలో ఉంది, ఏ వేగంతో వస్తోందో అంచనా వేయలేక ఢీకొనే ప్రమాదాలు పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా నేషనల్ హైవేలు, స్టేట్ హైవేలపై లారీలు, బస్సులు, కార్లకు అమర్చిన ఎల్ఈడీ ఫాగ్ ల్యాంపుల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు. ద్విచక్ర వాహనదారులు ఈ లైట్ల ధాటికి బ్యాలెన్స్ కోల్పోయి రోడ్డుపై పడిపోతున్న ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు.

భయం.. భయంగా ప్రయాణికులు

రాత్రి వేళ హైవేలపై ప్రయాణం చేయాలంటేనే భయంగా మారిందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు, ఆర్టీవో అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని మండిపడుతున్నారు. ఎదురుగా వాహనం ఉన్నా డిప్పర్ వేయకుండా హైబీమ్‌లోనే వస్తుండటంతో ప్రమాదాలు మరింత పెరుగుతున్నాయని చెబుతున్నారు. ఎల్ఈడీ లైట్లు అమర్చిన వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, మోటారు వాహన చట్టం 1988 సెక్షన్ 190(2) ప్రకారం భారీ జరిమానాలు విధించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ లైట్లు అమర్చిన వాహనాలను సీజ్ చేసి లైట్లు తొలగించాలని, నిషేధిత ఎల్ఈడీ లైట్లు విక్రయించే షాపులపై దాడులు నిర్వహించాలని కోరుతున్నారు. ప్రాణాలు తీస్తున్న అక్రమ ఎల్ఈడీ లైట్ల మాఫియాపై రవాణా, పోలీసు శాఖలు వెంటనే ఉక్కుపాదం మోపాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరకాలలో ఘనంగా బక్రీద్ వేడుకలు

- ఈద్గా ప్రాంగణంలో ప్రత్యేక ప్రార్థనలు

వేద న్యూస్, పరకాల:

పరకాల పట్టణంలోని ఈద్గా ప్రాంగణంలో బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) పర్వదిన వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డీసీసీ అధ్యక్షులు, వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఈద్గాలో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక సామూహిక నమాజ్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇనగాల వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగం, భక్తి, కరుణకు ప్రతీక అని అన్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాలు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి పండుగలు జరుపుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ముస్లిం మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మైనారిటీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

బాల్క సుమన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

- రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే సహించబోం
- మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి

వేద న్యూస్, పరకాల:

రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడిన బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరం చేయడం ఎంత తప్పో, దానిని ప్రోత్సహించేలా మాట్లాడటం కూడా అంతే నేరమని అన్నారు. బాల్క సుమన్ సంఘ విద్రోహ శక్తిలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు కార్యకర్తలను రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూస్తున్నారని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతుల పేరుతో ప్రజా ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ఆందోళనలకు ప్రజలు, రైతుల మద్దతు లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులు, రైలు పట్టాలు తగలబెట్టాలని వ్యాఖ్యానించడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్ తెలంగాణ పట్ల చిత్తశుద్ధి ఉంటే బాల్క సుమన్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి అంతర్జాతీయ రూపురేఖలు

- మంత్రి పొంగులేటి ఆదేశాలతో సమగ్ర మాస్టర్ ప్లాన్

వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:

నేలకొండపల్లి బౌద్ధ మహాస్తూపాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసింది. తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ చారిత్రక క్షేత్ర అభివృద్ధికి ఇప్పటికే రూ.2.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టాల్సిన పనులతో పాటు భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించడంతో గురువారం వారసత్వ శాఖ ఉన్నతస్థాయి బృందం క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించింది. తెలంగాణ వారసత్వ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్‌రావు కుతాటి, బుద్ధవనం ప్రాజెక్టు మెంటార్ సి. ఆంజనేయరెడ్డి నేతృత్వంలోని అధికారులు, పురావస్తు నిపుణుల బృందం బౌద్ధ స్తూప పరిసరాలను విస్తృతంగా పరిశీలించింది. ల్యాండ్‌స్కేపింగ్, పర్యాటక వసతులు, భవిష్యత్ నిధుల అవసరాలపై అధికారులు సమీక్ష నిర్వహించారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఎన్‌జీఆర్ఐ సహకారంతో భూగర్భ జియోఫిజికల్ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. భూగర్భంలో దాగివున్న చారిత్రక అవశేషాలను శాస్త్రీయంగా గుర్తించి సంరక్షించనున్నారు. అలాగే పర్యాటక వసతుల విస్తరణ కోసం సుమారు నాలుగు ఎకరాల భూమి సేకరణపై కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. పర్యాటకులను ఆకర్షించేలా త్రీడీ ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్, ఆడియో-విజువల్ గ్యాలరీలు, ఓపెన్ ఎయిర్ అంఫీ థియేటర్, అంతర్జాతీయ స్థాయి వాకింగ్ మార్గాలు, ప్రత్యేక లైటింగ్ వంటి ఆధునిక వసతులను ప్రణాళికలో చేర్చనున్నారు. పూర్తి వ్యయ అంచనాలతో కూడిన సమగ్ర నివేదికను రాబోయే రెండు నెలల్లో ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు వారసత్వ శాఖ అధికారులు వెల్లడించారు.

అధ్వాన్నంగా గద్వాల ఆర్టీసీ బస్టాండ్!

- వర్షపు నీటితో ప్రయాణికుల అవస్థలు
- ప్లాట్‌ఫామ్‌ల వద్ద నిల్వ నీటితో తీవ్ర ఇబ్బందులు
- బురదలోనే బస్సులు ఎక్కుతున్న ప్రయాణికులు

వేద న్యూస్, గద్వాల ప్రతినిధి:

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టాండ్‌లో వర్షపు నీరు భారీగా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని వివిధ మండలాలకు నిత్యం వందలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు ఈ బస్ స్టాండ్‌ను వినియోగిస్తుంటారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలతో బస్ స్టాండ్ ప్రాంగణమంతా నీటితో నిండిపోయింది. ముఖ్యంగా బస్సులు ఎక్కే ప్లాట్‌ఫామ్‌ల వద్ద నీరు నిల్వ ఉండటంతో ప్రయాణికులు బురదలోనే నడుచుకుంటూ బస్సులు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యార్థులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల మురుగు నీరు కలవడంతో దుర్వాసన వ్యాపిస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిన ప్రతిసారి ఇదే సమస్య తలెత్తుతోందని, సరైన డ్రైనేజ్ వ్యవస్థ లేకపోవడమే

దీనికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిల్వ నీటిని తొలగించడంతో పాటు శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

వీఓఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- నిరవధిక సమ్మెకు సీపీఎం మద్దతు

వేద న్యూస్, బోయినిపల్లి:

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో గత పది రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లను సీపీఎం నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే వి ఓ ఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వి ఓ ఏలకు నెలకు రూ.20 వేల కనీస వేతనం ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. అర్హులైన వి ఓ ఏలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని, సాధారణ మరియు ఆరోగ్య బీమా కింద రూ.20 లక్షల భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ట్యాబ్, నెట్ సౌకర్యాలు కల్పించడంతో పాటు 58 జీవోను సవరించాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రేడింగ్ విధానం రద్దు చేయాలని, వేతనాలు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీపీఎం కమిటీ సభ్యులు, వి ఓ ఏలు మంత్రి మణెమ్మ, కొనుగటి భాగ్యలక్ష్మి, గుండెల్లి వరలక్ష్మి, మార మహేందర్, చంద్రగిరి మల్లేశ్వరి, అక్కనపెల్లి కాంతవ, మల్లారపు జయసుధ, బొంగాని జ్యోతి, వంచ మమత, నర్సింగ్, రోజా కళావతి, పెరుక అనిత, కట్ట అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

పంతులుపల్లిలో బడిబాట

- ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెంచాలని పిలుపు

వేద న్యూస్, నల్లబెల్లి:

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం 202627 అమలులో భాగంగా గురువారం నాగరాజుపల్లె గ్రామ పరిధిలోని పంతులుపల్లి ప్రాథమిక పాఠశాలలో యువత, స్థానిక నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాల హెడ్‌మాస్టర్ కర్ణకంటి రామ్మూర్తి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి గ్రామ సర్పంచ్ ఎరుకల లలిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వార్డు సభ్యుడు ఊటుకూరి కృష్ణ, యువజన సంఘం నాయకులు ఊటుకూరి విష్ణువర్ధన్, పెండ్లి విష్ణువర్ధన్, ఇంతల పవన్, అభిషేక్, విష్ణువికాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెడ్‌మాస్టర్ కర్ణకంటి రామ్మూర్తి మాట్లాడుతూ గ్రామంలోని అన్ని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్యార్హతను పెంపొందించడమే లక్ష్యమన్నారు. ప్రతి యువకుడు కనీసం ఒక విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే బాధ్యత తీసుకోవాలని కోరారు. సర్పంచ్ ఎరుకల లలిత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని తెలిపారు. విద్యార్థులకు ఉచిత అల్పాహారం, 14 రకాల సామగ్రితో కూడిన కిట్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువకులు, సామాజిక నాయకులు పాల్గొని విద్యార్థుల చేరికలను పెంచే అంశాలపై చర్చించారు.

కార్యకర్తల కుటుంబాలకు 'ఇనగాల' పరామర్శ

వేద న్యూస్, నడికూడ:

నడికూడ మండలంలోని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను గురువారం వరంగల్ కుడా చైర్మన్, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి పరామర్శించారు. నడికూడ మాజీ సర్పంచ్ నారగాని ఐలయ్య సతీమణి సుగుణ, గ్రామ కమిటీ అధ్యక్షురాలు ఆరేకొండ తారాబాయి కుటుంబాలను కలిసి ఓదార్చారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆకారపు క్రాంతికుమార్ దశదిన కార్యక్రమానికి హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పులిగిళ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువనేత జక్కుల కుమారస్వామి తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల, గ్రామ అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చిన్నారి షణ్ముఖిని ఆశీర్వదించిన చందుపట్ల కీర్తి రెడ్డి

వేద న్యూస్, శాయంపేట:

శాయంపేట మండల కేంద్రంలో దైవంపెల్లి సుమలత-సతీష్ కుమార్ కుమార్తె చిన్నారి షణ్ముఖి నూతన వస్త్రాలంకరణ మహోత్సవ వేడుకకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తాటికొండ రవి కిరణ్, మండల అధ్యక్షుడు రామకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు కోమటి రాజశేఖర్, మండల కార్యదర్శి మేకల సుమన్, బూత్ అధ్యక్షుడు కొడపాక సంజీవరావు, సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

వేద న్యూస్, శాయంపేట:

భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట మండల కేంద్రానికి చెందిన భారతీయ జనతా పార్టీ కార్యకర్త బాసని నవీన్ తండ్రి బాసని బిక్షపతి ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి పరామర్శించారు. అలాగే మైలారం గ్రామానికి చెందిన బొంతల ఎల్లమ్మ, మోతే జనయ్య కుటుంబాలను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాయరాకుల మొగిలి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాటికొండ రవికిరణ్, మండల అధ్యక్షుడు రామకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు రాజశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి, కార్యదర్శి మేకల సుమన్, సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

వేద న్యూస్, కోటగిరి:

కోటగిరి మండల కేంద్రంలో గురువారం నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మీర్జాపూర్ క్యాంప్‌లో మిక్కిలినేని నారాయణమ్మ – మిక్కిలినేని వెంకటరత్నం విరాళంగా ఇచ్చిన స్థలంలో, వారి జ్ఞాపకార్థం ఎస్‌డీఎఫ్ నిధులతో రూ.కోటి వ్యయంతో నిర్మించిన నూతన జనరల్ ఫంక్షన్ హాల్‌ను పోచారం శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోటగిరి, పోతంగల్ మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వర్షాలతో బురదమయమైన సంగాల రహదారి

- ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు
- జారి పడుతున్న ద్విచక్ర వాహనాలు

వేద న్యూస్, గద్వాల జిల్లా ప్రతినిధి:

జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండల పరిధిలోని సంగాల గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలతో ప్రధాన రహదారి పూర్తిగా బురదమయంగా మారింది. రహదారిపై మట్టి పేరుకుపోవడంతో గ్రామస్తులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు జారి పడే పరిస్థితులు నెలకొనడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పలుచోట్ల వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రయాణం మరింత కష్టసాధ్యంగా మారింది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో గ్రామం నుంచి బయటకు వెళ్లడం కూడా కష్టంగా మారిందని తెలిపారు. ప్రతిరోజూ ఈ రహదారిపై రాకపోకలు సాగించే ప్రజలు ప్రమాద భయంతో ప్రయాణాలు చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదారిని మరమ్మతులు చేసి, నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కట్నం వేధింపులకు వివాహిత బలి

- గడ్డి మందు సేవించి చికిత్స పొందుతూ మృతి
- భర్తతో పాటు అత్తింటివారిపై కేసు నమోదు

వేద న్యూస్, గంగాధర:

గంగాధర మండలం గోపాల్రావుపల్లి గ్రామంలో అదనపు కట్న వేధింపులు తాళలేక ఓ వివాహిత గడ్డి మందు సేవించి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన విషాదాన్ని నింపింది. ఈ ఘటనకు సంబంధించి భర్తతో పాటు అత్తింటి కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. గోపాల్రావుపల్లి గ్రామానికి చెందిన నాగరపు లాస్య అలియాస్ నలువాల మమత (32)కు ఎనిమిదేళ్ల క్రితం నాగరపు అనిల్‌తో వివాహం జరిగింది. వివాహం అనంతరం అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్తింటివారు తరచూ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నెల 25న సాయంత్రం మమత గడ్డి మందు సేవించినట్లు గ్రామస్థుల ద్వారా సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతురాలి తండ్రి నలువాల ఓదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త నాగరపు అనిల్‌తో పాటు మామ, అత్త, ఆడబిడ్డలపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు గంగాధర ఎస్సై బి. వంశీకృష్ణ తెలిపారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు

- సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఈద్ ప్రార్థనలు

వేద న్యూస్, చిన్నచింతకుంట:

చిన్నచింతకుంట మండల కేంద్రంలో బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం అహ్మదీయ ముస్లిం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు స్థానికంగా వేలాది మంది భక్తులు హాజరయ్యారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు రోడ్డుపై ఏర్పాటు చేసిన ఈద్‌గాహ్ వద్దకు చేరుకుని ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమాములు, ముస్లిం సమాజ ప్రముఖులు బక్రీద్ పండుగ ప్రాముఖ్యతపై ప్రసంగించారు. పండుగ త్యాగం, సేవాభావం, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని పేర్కొంటూ పేదలకు సహాయం చేయాలని, దాతృత్వాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు పరస్పర సఖ్యతతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రార్థనలు ముగిసిన అనంతరం ముస్లిం సోదరులు పరస్పరం ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నపిల్లలు, యువత, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. స్థానిక నాయకులు, ముస్లిం సమాజ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు పండుగ నిర్వహణకు సహకరించారు. చిన్నచింతకుంట పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టడంతో కార్యక్రమం శాంతియుతంగా ముగిసింది.

ప్రధాన రహదారిపై ప్రమాదాలకు నిలయంగా గుంత

- రద్దీ ప్రాంతంలో ప్రజలకు తప్పని ఇబ్బందులు

వేద న్యూస్, చొప్పదండి:

కరీంనగర్ జిల్లా చొప్పదండి పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద అధికారులు నిర్లక్ష్యంగా వదిలేసిన గుంత ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. కొద్ది రోజుల క్రితం తారు రోడ్డు పనుల సమయంలో మిషన్ భగీరథ నీటి పైప్ పగిలిపోవడంతో గంటల పాటు నీరు వృథాగా పారింది. తర్వాత లీకేజీని మరమ్మతు చేసిన అధికారులు గుంతను పూడ్చకుండా అలాగే వదిలేయడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రోడ్డుపై పెద్ద పెద్ద స్లాబులు, మట్టి కుప్పలు ఉండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంత కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. పైప్‌లైన్ మరమ్మతులు పూర్తైన వెంటనే రోడ్డును యథాస్థితికి తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

'బక్కని' వ్యాఖ్యలు సరికాదు

- తెలంగాణ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలి – దావ వసంత సురేష్

వేద న్యూస్, జగిత్యాల:

మంగళగిరి మహానాడులో టీడీపీ నాయకుడు బక్కని నర్సింహులు చేసిన వ్యాఖ్యలను జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ తీవ్రంగా ఖండించారు. గురువారం మీడియాతో మాట్లాడిన ఆమె, డిక్షనరీలో 'తెలంగాణ అనే పదమే లేదు' అన్న వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. తెలంగాణ మట్టిలో పుట్టి పెరిగిన బక్కని నర్సింహులు, ఆంధ్ర నాయకుడు చంద్రబాబు నాయుడి మెప్పు కోసం తెలంగాణ ఉనికినే ప్రశ్నించేలా మాట్లాడటం దురదృష్టకరమన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'డిక్షనరీలో తెలంగాణ పదం లేదు' అనడం బక్కని నర్సింహులు అజ్ఞానానికి పరాకాష్ఠ. ఇది కేవలం ఆయన వ్యక్తిగత అజ్ఞానం మాత్రమే కాదు.. వందలాది మంది అమరుల త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ ఉద్యమాన్ని అవమానించడం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ నాయకత్వంలో ఎన్నో త్యాగాలు జరిగాయని, ఉద్యమ ఫలితంగానే 2014లో పార్లమెంట్ చట్టం ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన బక్కని నర్సింహులు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చరిత్రలో తెలంగాణ ద్రోహులుగా మిగిలిపోతారని దావ వసంత సురేష్ హెచ్చరించారు.

కాంగ్రెస్ అధికార ప్రతినిధి చిందం రవిపై దాడి

- రాడ్డుతో దాడి చేసి గాయపరిచిన వ్యక్తులు
- ఇద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు

వేద న్యూస్, శాయంపేట:

శాయంపేట మండలంలో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చిందం రవిపై దాడి జరిగిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శాయంపేట ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామపంచాయతీ ఎన్నికల్లో వార్డు సభ్యునిగా పోటీ చేసిన మారపల్లి సుమన్ తన ఓటమికి చిందం రవినే కారణమని భావించి కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో చిందం రవి ఇంటి ఆవరణలోకి వెళ్లి మారపల్లి సుమన్, మారపల్లి రాహుల్ కలిసి అతనిపై రాడుతో దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో చిందం రవికి ముక్కు, కన్ను భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. అడ్డుకోవడానికి వచ్చిన ఆయన భార్యను కూడా దుర్భాషలాడుతూ తోసివేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడు చిందం రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మారపల్లి సుమన్, మారపల్లి రాహుల్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తాం

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- ధర్మపురిలో వినతిపత్రం అందజేసిన ఆశా కార్యకర్తలు

వేద న్యూస్, ధర్మపురి:

రాష్ట్రంలోని ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లాకు చెందిన ఆశా వర్కర్లు గురువారం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆశా వర్కర్లు ఆరోగ్య రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని వెల్లడించారు. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి దశలవారీగా పరిష్కరిస్తామని ఆశా కార్యకర్తలకు హామీ ఇచ్చారు. ఆశా వర్కర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

జిల్లాలో ప్రశాంతంగా బక్రీద్ వేడుకలు

వేద న్యూస్, జగిత్యాల:

పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ జిల్లాలోని ముస్లిం సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. పండుగను శాంతి, సామరస్య వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ ప్రార్థనల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా జగిత్యాల, కోరుట్ల ప్రాంతాల్లోని పలు ఈద్గాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. ప్రార్థనలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతలను పర్యవేక్షించాలని సూచించారు. పండుగ సమయంలో జిల్లావ్యాప్తంగా నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ అశోక్ కుమార్ వెల్లడించారు.

వేద న్యూస్

శుక్రవారం మే 29 , 2026

ఘనంగా వీర్ సావర్కర్ జయంతి

– చిత్రపటానికి నివాళులర్పించిన మాజీ ఆర్మీ జవాన్ దంపతులు

వేద న్యూస్, మందమర్రి:

వినాయక్ దామోదర్ సావర్కర్ (వీర్ సావర్కర్) 143వ జయంతిని మాజీ ఆర్మీ జవాన్, ప్రస్తుతం ఎస్ అండ్ పిసి ఉద్యోగిగా పనిచేస్తున్న రాజేష్ పీవ్ హాల్, రాణి పీవ్ హాల్ దంపతులు గురువారం తమ నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీర్ సావర్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీర్ సావర్కర్ భారత స్వాతంత్ర్య సమరయోధుడిగా దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయారని పేర్కొన్నారు. 1883 మే 28న మహారాష్ట్రలోని భాగూర్ గ్రామంలో జన్మించిన సావర్కర్ విద్యార్థి దశ నుంచే దేశభక్తి భావాలతో ఉద్యమాలను ప్రారంభించారని తెలిపారు. లండన్‌లో బారిస్టర్ చదువుతూ ఇండియా హౌస్ ద్వారా విప్లవకారులను సంఘటితం చేశారని, నాసిక్ కలెక్టర్ జాక్సన్ హత్య కేసులో అరెస్ట్ చేసి బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు రెండుసార్లు యావజ్జీవ శిక్ష విధించిందన్నారు. అండమాన్ సెల్యులార్ జైలులో 12 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష అనుభవిస్తూ కూడా దేశభక్తి రచనలు కొనసాగించారని తెలిపారు. "ది ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ 1857", "హూ ఈజ్ ఏ హిందూ" వంటి రచనల ద్వారా జాతీయ భావజాలాన్ని వ్యాప్తి చేశారని పేర్కొన్నారు. అంటరానితనం నిర్మూలన, సామాజిక సంస్కరణల కోసం కూడా సావర్కర్ కృషి చేశారని కొనియాడారు. నేటి యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దేశ సేవలో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ రమేష్, సిహెచ్ మహేందర్, రాజు, శంకర్, డి. తిరుపతి, రోజా, సుశీల, లక్ష్మి, చంద్రకళ, నిర్మల, రజిత, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత రాములకు ఘన నివాళి

– కుటుంబ సభ్యులను పరామర్శించిన డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత

వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:

వేములపల్లి మండలం ఆమనగల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దేశబోయిన వెంకట్ రాములు (76) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం నల్గొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత ఆయన నివాసానికి చేరుకుని వెంకట్ రాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పున్న కైలాష్ నేత మాట్లాడుతూ.. వెంకట్ రాములు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, గ్రామ ప్రజల సేవకు జీవితాంతం కృషి చేశారని గుర్తుచేశారు. పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధత, ప్రజలతో ఉన్న అనుబంధం ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పిల్లల సందీప్, ఎలికంటి భరత్, కాంగ్రెస్ మండల నాయకులు రావు ఎల్లారెడ్డి, రేగట్టె రవీందర్ రెడ్డి, వార్డు సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం

– రైతులకు అండగా ప్రభుత్వం
– మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

వేద న్యూస్, పెద్దపల్లి:

పెద్దపల్లి జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రైతులకు కీలక హామీలు ఇచ్చారు. అకాల వర్షాల వల్ల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 8,885 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఇంకా 17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. మొత్తం 75 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని వెల్లడించారు. ఇప్పటివరకు 8 లక్షల మంది రైతులకు రూ.11 వేల కోట్లను చెల్లించినట్లు మంత్రి తెలిపారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించి మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ధాన్యం రవాణాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, ధాన్యం సేకరణ పూర్తయ్యే వరకు ఇసుక క్వారీల కార్యకలాపాలను నిలిపివేసి, ఆ లారీలను ధాన్యం తరలింపునకు వినియోగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రతిపక్షాల విమర్శలపై స్పందిస్తూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో రికార్డు స్థాయిలో ధాన్యం సేకరించాం. బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలు విడ్డూరంగా ఉన్నాయి అని మంత్రి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరిస్తే, మిగిలిన 25 లక్షల మెట్రిక్ టన్నులను రాష్ట్ర ప్రభుత్వమే మద్దతు ధరకే కొనుగోలు చేసిందని తెలిపారు. డిసెంబర్ 2023 తర్వాత రైతులకు అదనంగా రూ.16,470 కోట్లు చెల్లించి ప్రభుత్వం ఆదుకుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

ఆంజనేయ స్వామి దేవాలయానికి ఫ్యాన్ విరాళం

– భక్తుల సౌకర్యార్థం సహాయం చేసిన శ్రీను

వేద న్యూస్, కారేపల్లి:

కారేపల్లి మండలం అప్పాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని తూలిస్య తండా గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయానికి కారేపల్లి బీసీ కాలనీకి చెందిన టం టం శ్రీను ఫ్యాన్‌ను విరాళంగా అందజేశారు. దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆయన ఈ సహాయం చేయడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు నాగులు నాయక్, జి. లచ్చిరాం, బానోత్ రాములు, భూక్యా రాంలు, పాల్థియ్య లక్ష్మణ్, కోట మంగీలాల్ తదితరులు టం టం శ్రీనుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక సేవా దృక్పథంతో దేవాలయానికి సహాయం చేయడం అభినందనీయమని కొనియాడుతూ, ఇలాంటి సేవా కార్యక్రమాలకు మరింత మంది ముందుకు రావాలని కోరారు.

తిమ్మాపూర్ వద్ద రెండు కార్లు ఢీ

– కార్ల ముందు భాగాలు ధ్వంసం.. ప్రయాణికులు సురక్షితం

వేద న్యూస్, జగిత్యాల రూరల్:

జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులో బుధవారం రాత్రి రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటన కలకలం రేపింది. స్థానికుల వివరాల ప్రకారం.. గొల్లపల్లి నుంచి జగిత్యాల వైపు వస్తున్న రెండు కార్లు ప్రమాదవశాత్తు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు కార్ల ముందు భాగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అయితే కార్లలో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తృటిలో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న జగిత్యాల రూరల్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బతో పెయింటర్ మృతి

వేద న్యూస్ జూలూరుపాడు :

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోని న్యూ కాలనీకి చెందిన పెయింటర్ కల్లోజి నరేశ్ (37) వడదెబ్బకు గురై గురువారం మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నరేశ్ పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గత రెండు రోజులుగా తీవ్రమైన ఎండల్లో పని చేయడం వల్ల ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు మొదట స్థానిక వైద్యుల వద్ద ప్రథమ చికిత్స అందించారు. ఒక్కసారిగా నరేశ్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కొత్తగూడెం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో నరేశ్ తుదిశ్వాస విడిచాడు. నరేశ్‌కు భార్య, కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు. నరేష్ హఠాన్మరణంతో న్యూ కాలనీలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. నలుగురు చిన్న పిల్లలు ఉన్న ఇంటి యజమాని మరణించడంతో కుటుంబ సభ్యుల రోదనలు స్థానికులను కలచివేశాయి.

ముస్లిం డ్రైవర్లకు సరుకుల పంపిణీ

– బక్రీద్ సందర్భంగా సేవా కార్యక్రమం
– విద్య కోసం ఆర్థిక సహాయం అందజేత

వేద న్యూస్ గోదావరిఖని :

బక్రీద్ పండుగ సందర్భంగా గోదావరిఖని పట్టణంలోని చౌరస్తా అడ్డా2 ఆటో కార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో ముస్లిం ఆటో డ్రైవర్లకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నలభై మంది ఆటో డ్రైవర్లకు సరుకులు అందజేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాళ్ల హరీష్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించినట్లు పార్టీ సీనియర్ నాయకుడు జాహెద్ పాషా తెలిపారు. పండుగ సమయంలో ప్రతి కుటుంబానికి చేయూత అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ముస్లిం ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఉపయోగపడే విధంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ అడ్డా2 అధ్యక్షుడు అన్ను భాయ్ కుమారుడి ఉన్నత విద్య కోసం వీహెచ్ఆర్ ఫౌండేషన్ తరపున పది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తమ వంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. విద్యాభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు జాహెద్ పాషా మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధే కేసీఆర్ లక్ష్యమని అన్నారు. ఏ పండుగ వచ్చినా సంబంధిత సామాజిక వర్గాలకు చేయూత అందించడమే వీహెచ్ఆర్ ఫౌండేషన్ ఉద్దేశ్యమని పేర్కొన్నారు. పండుగ సమయంలో ప్రతి కుటుంబంలో ఆనందం నింపేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యాళ్ల హరీష్ రెడ్డి ప్రజలకు అండగా నిలుస్తూ నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని నాయకులు కొనియాడారు. ప్రజల జీవితాల్లో సంతోషం తీసుకురావడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ సందర్భంగా నిత్యావసర సరుకులు అందించినందుకు ఆటో కార్మిక సేవా సమితి ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సేవా సమితి అధ్యక్షుడు కడార్ల శ్రీధర్, పొలాడి శ్రీనివాసరావు, బూరుగు వంశీకృష్ణ, నారమళ్ళ రమేష్, జక్కుల ప్రేమ్ కుమార్, కొండ సురేష్, నూతి రాజ్ కుమార్, అస్లాం, అంకూస్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది.

ఆగివున్న లారీని ఢీకొట్టిన కారు.. ఇద్దరికి తీవ్రగాయాలు

వేద న్యూస్ హైదరాబాద్ :

ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎల్బీనగర్‌లో రోడ్డుపక్కన ఆగివున్న లారీని వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.వివరాల్లోకి వెళ్తే.. సూర్యాపేట జిల్లాకు చెందిన ధరావవత్ అశోక్ కారు నడుపుతుండగా అతనితో పాటుకారులో సరూర్‌నగర్‌కు చెందిన బొర్రా మధు ఉన్నారు. ఈ క్రమంలో ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిత్ర లేఅవుట్ సమీపంలో రోడ్డుపక్కన నిలిపివున్న లారీనీ గమనించని అశోక్ నేరుగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమైంది. అశోక్, మధు ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులను కామినేని ఆస్పత్రికి తరలించారు.

వేద న్యూస్

శుక్రవారం మే 29 , 2026

మెటా కొత్త పెయిడ్ ప్లాన్లు.. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లో ప్రత్యేక ఫీచర్లు

వేద న్యూస్ డెస్క్:

ప్రపంచ ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటా వినియోగదారుల కోసం కొత్త పెయిడ్ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్లను ప్రవేశపెట్టింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వేదికలపై ప్రత్యేక ఫీచర్లు అందించేలా ఈ చెల్లింపు సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం ఈ ప్లాన్లు ప్రపంచవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. స్టోరీలు, ప్రొఫైళ్లు, చాట్‌లు, రియాక్షన్‌లు, పోస్టులపై మరింత నియంత్రణ కోరుకునే వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని ఈ సేవలను రూపొందించినట్లు మెటా వెల్లడించింది. క్రియేటర్లు, వ్యాపార సంస్థలు, కృత్రిమ మేధ సాధనాలను ఎక్కువగా వినియోగించే వారికోసం 'మెటా వన్' పేరుతో ప్రత్యేక సబ్‌స్క్రిప్షన్ సేవలను కూడా తీసుకొచ్చింది. ప్రస్తుతం ఇవి 'మెటా వెరిఫైడ్' సేవలకు భిన్నంగా పనిచేస్తాయని సంస్థ తెలిపింది. ఫేస్‌బుక్ ప్లస్, ఇన్‌స్టాగ్రామ్ ప్లస్ ప్లాన్ల ధరను నెలకు 3.99 డాలర్లుగా నిర్ణయించారు. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.362 వరకు ఉంటుంది. ఇక వాట్సాప్ ప్లస్ ధర నెలకు 2.99 డాలర్లు కాగా, భారత కరెన్సీలో దాదాపు రూ.271గా ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్ ప్లస్ వినియోగదారులకు ప్రత్యేక స్టోరీ నియంత్రణలు, స్టోరీలను మళ్లీ చూసిన వారి వివరాలు తెలుసుకునే అవకాశం, వీక్షకుల జాబితాలో శోధన సదుపాయం, స్టోరీలను 24 గంటలకు మించి పొడిగించే అవకాశం వంటి ఫీచర్లు అందుబాటులో ఉంటాయి. అదనంగా వారానికి ఒకసారి స్టోరీని ప్రత్యేకంగా ప్రోత్సహించే సదుపాయం కూడా కల్పించారు. ఇక మెటా వన్ ప్లస్ ప్లాన్ ధర నెలకు 7.99 డాలర్లు కాగా, మెటా వన్ ప్రీమియం ప్లాన్ ధర నెలకు 19.99 డాలర్లుగా

ఉంది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.725 నుంచి రూ.1,814 వరకు ఉంటుంది. ఈ ప్రీమియం ప్లాన్లలో అధునాతన కృత్రిమ మేధ ఫీచర్లు, మరిన్ని ఫొటోలు, వీడియోలు రూపొందించే సదుపాయాలు, లోతైన విశ్లేషణ సామర్థ్యాలు లభించనున్నాయి. సాధారణ వినియోగదారులకు మెటా ఏఐ సేవలు ఉచితంగానే కొనసాగుతాయని సంస్థ స్పష్టం చేసింది. అయితే ఇప్పటికే ఓటీటీలు, సంగీత యాప్‌లు, క్లౌడ్ స్టోరేజ్, ఫుడ్ డెలివరీ సభ్యత్వాల కోసం చెల్లింపులు చేస్తున్న వినియోగదారులకు ఈ కొత్త ప్లాన్లు అదనపు ఆర్థిక భారంగా మారే అవకాశముందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

కొత్త టాటా టియాగో రాక..

వేద న్యూస్ డెస్క్:

భారత ఆటోమొబైల్ మార్కెట్లో హ్యాచ్‌బ్యాక్ విభాగంలో పోటీ మరింత పెరుగుతున్న వేళ టాటా మోటార్స్ కీలక అడుగు వేసింది. ఎన్నో అప్‌డేట్లతో 2026 టాటా టియాగో, టియాగో ఈవీ ఫేస్‌లిఫ్ట్ మోడళ్లను కంపెనీ అధికారికంగా మార్కెట్లోకి విడుదల చేసింది. ఆకర్షణీయమైన డిజైన్, కొత్త ఫీచర్లు, పోటీ ధరలతో ఈ కొత్త మోడళ్లు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. మారుతి సుజుకి స్విఫ్ట్, హ్యుందాయ్ గ్రాండ్ ఐ10 నియోస్ వంటి కార్లకు గట్టి పోటీగా ఈ కొత్త టియాగోను తీసుకొచ్చినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. పెట్రోల్ వేరియంట్ ప్రారంభ ధరను రూ.4.69 లక్షలుగా నిర్ణయించగా, టియాగో ఈవీ ప్రారంభ ధర రూ.6.99 లక్షలుగా ఉంది. సీఎన్‌జీ వేరియంట్ ధర రూ.5.79 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. అలాగే బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్ విధానంలో టియాగో ఈవీని రూ.4.69 లక్షలకే కొనుగోలు చేసి, కిలోమీటరుకు రూ.2.6 చొప్పున చెల్లించే అవకాశం కూడా కల్పించారు. ఈ సందర్భంగా టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ సంచలన ప్రకటన చేసింది. ఇకపై తమ అన్ని ఎలక్ట్రిక్ కార్లకు జీవితకాలం పాటు అపరిమిత కిలోమీటర్ల వారంటీ అందించనున్నట్లు వెల్లడించింది. టియాగో ఈవీతో పాటు పంచ్ ఈవీ, కర్వ్ ఈవీ, హ్యారియర్ ఈవీ, టిగోర్ ఈవీ మోడళ్లకు కూడా ఈ సదుపాయం వర్తించనుంది. కొత్త టియాగో ఈవీని స్మార్ట్, ప్యూర్ ప్లస్, క్రియేటివ్ ప్లస్ ట్రిమ్‌లలో విడుదల చేశారు. లాంగ్ రేంజ్ వేరియంట్‌లో 24 కిలోవాట్ అవర్ బ్యాటరీ ప్యాక్ ఉండగా, ఒక్కసారి ఫుల్ చార్జ్ చేస్తే 285 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. మీడియం రేంజ్ వేరియంట్‌లో 19.2 కిలోవాట్ అవర్ బ్యాటరీని అమర్చారు. చార్జింగ్ కోసం 3.3 కిలోవాట్ పోర్టబుల్ చార్జర్, 7.2 కిలోవాట్ హోమ్ చార్జర్, 30 కిలోవాట్ డీసీ ఫాస్ట్ చార్జింగ్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఫాస్ట్ చార్జర్‌తో కేవలం 18 నిమిషాల్లోనే 100 కిలోమీటర్ల ప్రయాణానికి సరిపడా చార్జ్ చేసుకోవచ్చని కంపెనీ తెలిపింది. డిజైన్ పరంగా కూడా కొత్త టియాగోకు ప్రీమియం లుక్ ఇచ్చారు. వారణాసి వైబ్రెన్స్, సోబో సర్జ్, పాంగాంగ్ పల్స్, ప్రిస్టీన్ వైట్, ప్యూర్ గ్రే, డేటోనా గ్రే వంటి రంగుల్లో ఈ కారు అందుబాటులోకి వచ్చింది. ఈవీ మోడల్‌కు ప్రత్యేకంగా 'డెహ్రాడూన్ డ్యూ' రంగును పరిచయం చేశారు. కారు ఇంటీరియర్‌లో కొన్ని చోట్ల ఉడుత బొమ్మను ప్రత్యేక డిజైన్ ఎలిమెంట్‌గా పొందుపరిచారు. బటన్ల డిజైన్‌ను కూడా మార్చి మరింత ఆధునికంగా తీర్చిదిద్దారు. ఈ కొత్త మార్పులతో టాటా టియాగో హ్యాచ్‌బ్యాక్ విభాగంలో మరింత పోటీని పెంచడం ఖాయమని ఆటోమొబైల్ నిపుణులు భావిస్తున్నారు

పీఎఫ్ ఖాతాలో తప్పులా..? ఇక ఇంట్లో నుంచే సులువుగా మార్చుకోండి

వేద న్యూస్ డెస్క్:

ప్రైవేట్ ఉద్యోగులు తప్పనిసరిగా కలిగి ఉండే పీఎఫ్ ఖాతాలకు సంబంధించిన సేవలను ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ మరింత సులభతరం చేసింది. ఇప్పుడు పీఎఫ్ ఖాతాలో పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు వంటి వివరాల్లో పొరపాట్లు ఉన్నా ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్ ద్వారా సులువుగా సవరించుకునే అవకాశం కల్పిస్తోంది. చాలామంది ఖాతాదారులు పీఎఫ్ వివరాల్లో తప్పులు ఉంటే ఎలా మార్చుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతుంటారు. అయితే ఈపీఎఫ్‌వో పోర్టల్ ద్వారా కొన్ని నిమిషాల్లోనే వివరాలను సవరించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ఏ వివరాలు మార్చుకోవచ్చు..? పేరు, పుట్టిన తేదీ, లింగం, తండ్రి లేదా భర్త పేరు, వైవాహిక స్థితి, జాతీయత, పీఎఫ్‌లో చేరిన తేదీ, ఉద్యోగం వదిలిన తేదీ, ఈపీఎస్ జాయినింగ్, ఎగ్జిట్ తేదీలు వంటి అనేక వివరాలను ఆన్‌లైన్‌లో సవరించుకోవచ్చు. ఇలా మార్చుకోవాలి ముందుగా ఈపీఎఫ్‌వో అధికారిక పోర్టల్‌లోకి వెళ్లాలి. అక్కడ సర్వీసెస్ విభాగంలో ఫర్ ఎంప్లాయీస్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. తర్వాత యూఏఎన్ నంబర్, పాస్‌వర్డ్ నమోదు చేసి లాగిన్ కావాలి. ఓటీపీ ధృవీకరణ పూర్తయ్యాక మేనేజ్ విభాగంలో జాయింట్ డిక్లరేషన్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. తర్వాత ప్రస్తుతం పనిచేస్తున్న సంస్థ వివరాలను ఎంపిక చేసి, గెట్ డీటైల్స్‌పై క్లిక్ చేస్తే ఖాతా సమాచారం కనిపిస్తుంది. అందులో సవరించాల్సిన వివరాన్ని ఎంపిక చేసి కొత్త సమాచారం నమోదు చేయాలి. అవసరమైన పత్రాలు అప్‌లోడ్ చేసిన తర్వాత సబ్మిట్ చేస్తే ప్రక్రియ పూర్తవుతుంది. అవసరమైన పత్రాలు పేరు లేదా లింగం మార్చుకోవాలంటే ఆధార్, పాన్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్ వంటి గుర్తింపు పత్రాలు అవసరం. పుట్టిన తేదీ సవరణకు జనన సర్టిఫికేట్, టెన్త్ మెమో, ఆధార్ లేదా పాస్‌పోర్ట్ సమర్పించాలి. తండ్రి లేదా భర్త పేరు మార్చుకోవాలంటే మ్యారేజ్ సర్టిఫికేట్, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ వంటి పత్రాలు అవసరం అవుతాయి. ఉద్యోగ సంస్థ వివరాలు మార్చాలంటే అపాయింట్‌మెంట్ లెటర్, రిలీవింగ్ లెటర్, ఈఎస్ఐసీ కార్డు వంటి డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుంది. ఈ సదుపాయం వల్ల ఉద్యోగులు కార్యాలయాలకు వెళ్లకుండా ఇంటి నుంచే తమ పీఎఫ్ ఖాతా వివరాలను సులభంగా సవరించుకునే అవకాశం లభిస్తోంది.

సచిన్ ప్రశంసించిన వైభవ్ తుఫాన్

వేద న్యూస్ డెస్క్:

ఐపీఎల్-2026 ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ సంచలన ఇన్నింగ్స్‌తో క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే అతడు 29 బంతుల్లో 97 పరుగులు చేసి సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ముఖ్యంగా ఆస్ట్రేలియా స్టార్ బౌలర్ పాట్ కమిన్స్ బౌలింగ్‌ను ధాటిగా ఎదుర్కొంటూ స్టేడియంను హోరెత్తించాడు. ఈ అద్భుత ప్రదర్శనపై భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసలు కురిపించాడు. వైభవ్ బ్యాటింగ్ తీరుపై స్పందించిన సచిన్, అతడి బ్యాట్ స్వింగ్ అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. కాళ్ల వైపు వచ్చే బంతులను ఫ్రంట్ ఫుట్ క్లియర్ చేసి పక్కకు జరుగుతూ ఆడే విధానం తనను బాగా ఆకట్టుకుందని తెలిపారు. ఈ స్వేచ్ఛే అతడిని తనదైన శైలిలో ఆడేలా చేస్తోందని కొనియాడారు. వైభవ్ ఆడిన ఇన్నింగ్స్ నిజంగా అసాధారణమని సచిన్ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ మ్యాచ్‌లో వైభవ్ మొత్తం 12 భారీ సిక్సర్లు బాదుతూ ప్రత్యర్థి బౌలర్ల వ్యూహాలను పూర్తిగా ధ్వంసం చేశాడు. తక్కువ బంతుల్లోనే భారీ స్కోరు సాధించి పలు రికార్డులను తిరగరాశాడు. అతడి దూకుడు బ్యాటింగ్‌తో రాజస్థాన్ రాయల్స్ భారీ స్కోరు నమోదు చేయగలిగింది. వైభవ్ ప్రదర్శన చూసిన క్రికెట్ అభిమానులు, విశ్లేషకులు అతడిని భారత క్రికెట్ భవిష్యత్ స్టార్‌గా అభివర్ణిస్తున్నారు. చిన్న వయసులోనే ఒత్తిడిని అధిగమిస్తూ ఆత్మవిశ్వాసంతో ఆడుతున్న తీరు అందరినీ ఆకట్టుకుంటోంది. భవిష్యత్తులో భారత జట్టుకు అతడు కీలక ఆటగాడిగా మారే అవకాశాలు ఉన్నాయని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

వినేశ్ ఫొగాట్‌కు ట్రయల్స్ అనుమతి..

వేద న్యూస్ డెస్క్:

ఆసియా క్రీడల ఎంపిక ట్రయల్స్‌లో పాల్గొనేందుకు స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన అనుమతి ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు దాకా చేరింది. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరధే ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టనుంది. ఈ వివాదానికి కేంద్రబిందువుగా మారింది ఆసియా క్రీడల సెలక్షన్ ట్రయల్స్ ప్రక్రియ. మే 30, 31 తేదీల్లో జరగనున్న ఈ ట్రయల్స్‌లో వినేశ్ ఫొగాట్ పాల్గొనేందుకు హైకోర్టు ఇటీవల అనుమతిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. మే 22న ఢిల్లీ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఈ తీర్పు భారత రెజ్లింగ్ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. వినేశ్ ఫొగాట్‌ను ట్రయల్స్ నుంచి తప్పించడం అన్యాయమని హైకోర్టు అభిప్రాయపడింది. ముఖ్యంగా ప్రసూతి విరామం తీసుకున్న కారణంగా ఆమెకు అవకాశాన్ని నిరాకరించడం సరైంది కాదని స్పష్టం చేసింది. మహిళా క్రీడాకారిణుల హక్కులు, సమాన అవకాశాల అంశాన్ని కోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. అంతేకాదు, ఆసియా క్రీడల ఎంపిక కోసం డబ్ల్యూఎఫ్ఐ రూపొందించిన ఎంపిక ప్రమాణాలపై కూడా హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గత ప్రదర్శనలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా రూపొందించిన నిబంధనలు వివక్షపూరితంగా



ఉన్నాయని వ్యాఖ్యానించింది. క్రీడాకారుల ప్రతిభ, గత విజయాలు, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోకుండా రూపొందించిన ఎంపిక విధానం పారదర్శకతకు విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. ఇక మే 9న డబ్ల్యూఎఫ్ఐ వినేశ్‌కు జారీ చేసిన షోకాజ్ నోటీసుపై కూడా హైకోర్టు తీవ్రంగా స్పందించింది. పారిస్ ఒలింపిక్స్ ఫైనల్ సందర్భంగా అధిక బరువు కారణంగా వినేశ్ అనర్హతకు గురికావడం దేశానికి అవమానమని నోటీసులో పేర్కొనడాన్ని కోర్టు తప్పుబట్టింది. ఒక క్రీడాకారిణి ఎదుర్కొన్న పరిస్థితిని ఈ విధంగా వ్యాఖ్యానించడం తగదని స్పష్టం చేసింది.

కార్ల్‌సన్‌కు షాక్ ఇచ్చిన ప్రజ్ఞానంద్

వేద న్యూస్ డెస్క్:

భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద్ మరోసారి ప్రపంచ చెస్ దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్‌పై సంచలన విజయం సాధించాడు. నార్వే చెస్ టోర్నమెంట్‌లో స్వదేశంలో ఆడుతున్న కార్ల్‌సన్‌ను ఓడించి ప్రజ్ఞానంద్ మూడు కీలక పాయింట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రపంచ నంబర్‌వన్ ఆటగాడిపై అతను సాధించిన ఈ విజయం చెస్ ప్రపంచంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. గత ఏడాది కూడా ఇదే టోర్నీలో కార్ల్‌సన్‌పై గెలిచిన ప్రజ్ఞానంద్, ఈసారి కూడా అదే జోరును కొనసాగించాడు. కార్ల్‌సన్ స్వదేశంలోనే అతనిపై వరుస విజయాలు సాధించడం భారత చెస్‌కు గర్వకారణంగా నిలిచింది. ఇటీవల రొమేనియాలో జరిగిన సూపర్‌బెట్ చెస్ క్లాసిక్ టోర్నీలో టైటిల్ గెలిచిన ప్రజ్ఞానంద్ మంచి ఆత్మవిశ్వాసంతో నార్వే చెస్ టోర్నీలో అడుగుపెట్టాడు. అదే ఫామ్‌ను కొనసాగిస్తూ మరో అద్భుత ప్రదర్శన చేశాడు. ఇక మరో భారత స్టార్ డీ గుకేశ్‌కు మాత్రం ఈ రౌండ్ నిరాశ కలిగించింది. ఫ్రాన్స్‌కు చెందిన అలిరెజా ఫిరౌజా చేతిలో గుకేశ్ ఓటమి పాలయ్యాడు.

కేన్ విలియమన్స్ వరల్డ్ రికార్డ్

వేద న్యూస్ డెస్క్:

న్యూజిలాండ్ స్టార్ క్రికెటర్లు కేన్ విలియమ్సన్, టామ్ లాథమ్ అరుదైన ప్రపంచ రికార్డును తమ పేరిట నమోదు చేసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా 12 వేర్వేరు దేశాల్లో టెస్ట్ క్రికెట్ ఆడిన తొలి జంటగా చరిత్ర సృష్టించారు. ఐర్లాండ్‌తో బెల్‌ఫాస్ట్ వేదికగా జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో ఈ ఘనతను అందుకున్నారు. ఈ మ్యాచ్‌కు ముందు వరకు కేన్ విలియమ్సన్, టామ్ లాథమ్‌లు 11 దేశాల్లో టెస్ట్ మ్యాచ్‌లు ఆడి షేన్ వార్న్, క్రిస్ గేల్, శివనారాయణ్ చంద్రపాల్‌తో పాటు పలువురు పాకిస్థాన్ మాజీ ఆటగాళ్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు. అయితే ఐర్లాండ్‌లో అడుగుపెట్టడంతో ఆ రికార్డును అధిగమించి కొత్త చరిత్ర సృష్టించారు. ఇదిలా ఉండగా, బెల్‌ఫాస్ట్ టెస్టులో న్యూజిలాండ్ బ్యాటర్లు భారీ స్కోరు దిశగా దూసుకెళ్తున్నారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ జట్టు 5 వికెట్ల నష్టానికి 361 పరుగులు చేసింది. టామ్ బ్లండెల్ 142 పరుగులతో అజేయంగా నిలవగా, డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్ 38 పరుగులతో క్రీజులో ఉన్నాడు. అంతకుముందు రచిన్ రవీంద్ర అద్భుత సెంచరీతో 121 పరుగులు చేసి జట్టుకు బలమైన పునాది వేశాడు. ఈ మ్యాచ్‌లో కేన్ విలియమ్సన్ 36 పరుగులు చేసి పర్వాలేదనిపించగా, టామ్ లాథమ్ మాత్రం ఖాతా తెరవకుండానే ఔటయ్యాడు. అయినప్పటికీ ఈ ఇద్దరూ కలసి సృష్టించిన అరుదైన రికార్డు ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. 2010లో భారత్‌తో జరిగిన మ్యాచ్ ద్వారా టెస్ట్ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన కేన్ విలియమ్సన్, తొలి మ్యాచ్‌లోనే సెంచరీ బాదుతూ ప్రపంచ దృష్టిని ఆకర్షించాడు. అతడి నాయకత్వంలో న్యూజిలాండ్ 2021లో తొలి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను గెలుచుకుంది. ఇప్పటివరకు 109 టెస్టుల్లో 9,497 పరుగులు చేసిన విలియమ్సన్, ప్రపంచ అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిగా గుర్తింపు పొందాడు.

వేద న్యూస్

శుక్రవారం మే 29 , 2026

రూపమే ఇప్పుడు తన స్టైల్ అంటున్న సమీరా రెడ్డి

వేద న్యూస్ డెస్క్:

ఒకప్పుడు టాలీవుడ్‌లో తన అందం, స్టైల్, గ్లామర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న నటి సమీరా రెడ్డి.. ఇప్పుడు పూర్తిగా భిన్నమైన ఆలోచనలతో జీవితాన్ని ఆస్వాదిస్తున్నట్లు వెల్లడించారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ మహిళల ఆరోగ్యం, మానసిక ఒత్తిడి, బాడీ పాజిటివిటీ వంటి అంశాలపై తరచూ స్పందించే సమీరా.. తాజాగా చేసిన పోస్టు నెట్టింట వైరల్‌గా మారింది. 2005లో జూనియర్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కిన 'నరసింహుడు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన సమీరా రెడ్డి.. ఆ తర్వాత మెగాస్టార్ చిరంజీవి నటించిన 'జై చిరంజీవ' చిత్రంతో మరింత పాపులారిటీ సంపాదించారు. తన ప్రత్యేకమైన స్క్రీన్ ప్రెజెన్స్, గ్లామర్‌తో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. తర్వాత బాలీవుడ్, తమిళ సినిమాల్లో కూడా నటించారు. అయితే పెళ్లి తర్వాత సినిమాలకు దూరమై కుటుంబ జీవితానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఇటీవల సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించిన సమీరా.. తన వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న కఠిన పరిస్థితులను ఓపెన్‌గా పంచుకున్నారు. ముఖ్యంగా బిడ్డ పుట్టిన తర్వాత హార్మోన్ల అసమతుల్యత కారణంగా తన శరీరంలో వచ్చిన మార్పులు తనను మానసికంగా ఎంతగానో ప్రభావితం చేశాయని తెలిపారు. ఒక దశలో తన బరువు 105 కిలోలకు పైగా పెరిగిపోయిందని, ఆ సమయంలో సోషల్ మీడియాలో తీవ్ర ట్రోలింగ్ ఎదుర్కొన్నానని చెప్పారు. "గతంలో నేను ఎలా కనిపిస్తున్నానో అనే విషయంపైనే ఎక్కువగా ఆలోచించేదాన్ని. ఫిట్‌గా ఉండాలి, గ్లామరస్‌గా కనిపించాలి, అందంగా ఉండాలి అనే ఒత్తిడి ఎప్పుడూ ఉండేది. కానీ ఇప్పుడు ఆ ఒత్తిడినంతా పూర్తిగా వదిలేశాను. నా రూపమే ఇప్పుడు నా స్టైల్‌గా మారింది" అంటూ సమీరా రెడ్డి పేర్కొన్నారు. ఇక స్టైలిష్ దుస్తులు ధరించడం, ఎప్పుడూ పర్ఫెక్ట్‌గా కనిపించాలనే ఆలోచన ఇప్పుడు తనలో లేదని ఆమె స్పష్టం చేశారు. "ఇతరులు ఏమనుకుంటారో అనే భయం నుంచి బయటపడిన తర్వాతే నిజమైన ఆనందం ఏమిటో తెలిసింది. మనల్ని మనం అంగీకరించుకోవడం జీవితంలో చాలా ముఖ్యమైన విషయం" అని ఆమె పేర్కొన్నారు. తన బరువు పెరిగిన సమయంలో చాలామంది విమర్శలు చేశారని, దగ్గరి వ్యక్తులు కూడా బాధించేలా మాట్లాడారని సమీరా గుర్తుచేసుకున్నారు. "జనాలు చాలా ఈజీగా జడ్జ్ చేస్తారు. మీ రూపం మారితే వెంటనే కామెంట్లు చేస్తారు. కానీ ఆ విమర్శలు నన్ను బలహీనపరచలేదు. అవే నన్ను మరింత బలంగా మార్చాయి" అని ఆమె తెలిపారు. ప్రస్తుతం సమీరా రెడ్డి సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉంటూ మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంచేలా పోస్టులు చేస్తున్నారు. ముఖ్యంగా ప్రసవం తర్వాత మహిళల్లో వచ్చే శారీరక, మానసిక మార్పుల గురించి అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. బాడీ

షేమింగ్, డిప్రెషన్, మానసిక ఒత్తిడి వంటి అంశాలపై ధైర్యంగా మాట్లాడుతున్న ఆమెను చాలామంది మహిళలు ఆదర్శంగా భావిస్తున్నారు. సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో సమీరాకు మంచి ఫాలోయింగ్ ఉంది. ఆమె పంచుకునే వీడియోలు, కుటుంబంతో గడిపే క్షణాలు, ఆరోగ్య సూచనలు, మోటివేషనల్ పోస్టులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. గ్లామర్ ప్రపంచంలో ఉన్నప్పటికీ సహజసిద్ధమైన జీవనశైలిని ఎంచుకోవడం వల్లే ఇప్పుడు తాను మానసికంగా ఎంతో ప్రశాంతంగా ఉన్నానని సమీరా వెల్లడించారు. "అందం అనేది కేవలం శరీరాకృతి కాదు. మనసు ప్రశాంతంగా ఉండటం, మనల్ని మనం ప్రేమించుకోవడం కూడా అందమే" అంటూ సమీరా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి.

ఆగస్టు 14న 'విశ్వనాథ్ అండ్ సన్స్' విడుదల

వేద న్యూస్ డెస్క్:

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాను ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వచ్చే దీర్ఘ వీకెండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ తేదీని ఖరారు చేసినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. 'సార్', 'లక్కీ భాస్కర్' చిత్రాలతో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు వెంకీ అట్లూరి.. ఈసారి సూర్యతో కలిసి భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న కుటుంబ కథా చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో సూర్య 40 ఏళ్ల అంతర్జాతీయ పిస్టల్ షూటర్ 'సంజయ్ విశ్వనాథ్' పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఈ పాత్ర కోసం ఆయన పూర్తిగా కొత్త లుక్‌లో దర్శనమివ్వబోతున్నారని చిత్రబృందానికి సమీప వర్గాలు చెబుతున్నాయి. సూర్య సరసన యువ కథానాయిక మమితా బైజు నటిస్తుండగా.. సీనియర్ నటీమణులు రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్, భవాని శ్రీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ స్వరాలు సమకూరుస్తుండగా.. నిమిష్ రవి ఛాయాగ్రహణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎడిటర్‌గా నవీన్ నూలి పనిచేస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలు, క్రీడా నేపథ్యం, యాక్షన్ అంశాలతో రూపొందుతున్న ఈ చిత్రం తెలుగు, తమిళ ప్రేక్షకులను ఒకేసారి ఆకట్టుకునేలా ఉండబోతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

ఫిట్‌నెస్‌కి సుధీర్ బాబు క్రమశిక్షణే రహస్యం

వేద న్యూస్ డెస్క్:

టాలీవుడ్ హీరో సుధీర్ బాబు తన ఫిట్‌నెస్, ఆహార నియమాల గురించి గతంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. దశాబ్ద కాలానికి పైగా సిక్స్‌ప్యాక్‌ను మెయింటైన్ చేయడం కేవలం సినిమాల కోసం కాదని, అది తన జీవనశైలిలో భాగమని ఆయన చెప్పారు. చిన్నప్పటి నుంచే సరైన ఆహారం, వ్యాయామం అలవాటు చేసిన తన తల్లే ఈ క్రమశిక్షణకు కారణమని పేర్కొన్నారు. అలాగే బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా ఉన్న అనుభవం కూడా తన ఫిట్‌నెస్‌పై ప్రభావం చూపిందన్నారు. తాను అన్నం పూర్తిగా మానేయలేదని, కానీ ప్రత్యక్ష చక్కెర పదార్థాలను మాత్రం పూర్తిగా దూరం పెడతానని సుధీర్ బాబు తెలిపారు. శరీరానికి అవసరమైన ఇంధనం సరైన మోతాదులో అందాలి కానీ అతిగా తినడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు. ఉదయం అల్పాహారంగా ఇడ్లీ తీసుకుంటానని, దోశ తిననని వెల్లడించారు. ప్రతి భోజనంలో అన్నం లేదా చపాతీ లేదా బ్రౌన్‌రైస్‌తో పాటు కూరగాయలు, చికెన్ వంటి ప్రోటీన్ ఆహారం తప్పనిసరిగా ఉంటుందని చెప్పారు. రోజుకు ఒక్కసారి లేదా రెండుసార్లు మాత్రమే తినాలనే సామెతలకు శాస్త్రీయ ఆధారం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. రోజుకు అవసరమైన కేలరీలను చిన్న చిన్న భాగాలుగా విభజించి తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థకు మేలు జరుగుతుందని తెలిపారు. అందుకే తాను రోజుకు ఆరు సార్లు ఆహారం తీసుకుంటానని వెల్లడించారు.

శ్రుతిహాసన్‌కు పాటలే ప్రత్యేక గుర్తింపు

వేద న్యూస్ డెస్క్:

అందం, అభినయం, గానం.. ఈ మూడు రంగాల్లోనూ తనదైన ముద్ర వేసిన నటీమణుల్లో శ్రుతిహాసన్ ఒకరు. ఒకప్పుడు వరుస సినిమాలతో టాలీవుడ్, కోలీవుడ్‌లో బిజీ హీరోయిన్‌గా కొనసాగిన ఆమె.. ఇప్పుడు ఆచితూచి కథలను ఎంపిక చేసుకుంటూ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తున్నారు. ఇటీవల కాలంలో ముఖ్యంగా పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తూ వరుస విజయాలను అందుకుంటున్నారు. కెరీర్ ప్రారంభంలో సరైన విజయాల కోసం ఎదురుచూడాల్సి వచ్చినా.. ఆ తర్వాత వరుస హిట్లతో శ్రుతిహాసన్ స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. తెలుగు, తమిళ భాషల్లో స్టార్ హీరోల సరసన నటిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. హిందీలో కూడా కొన్ని సినిమాలు చేసినప్పటికీ అక్కడ ఆశించిన స్థాయిలో సక్సెస్ దక్కకపోవడంతో ప్రస్తుతం దక్షిణాది చిత్రాలపైనే ఎక్కువ దృష్టి పెట్టారు. ప్రభాస్ హీరోగా తెరకెక్కిన 'సలార్' సినిమాతో శ్రుతిహాసన్ మరో భారీ విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు. ఆ సినిమాతో ఆమెకు దేశవ్యాప్తంగా మరింత క్రేజ్ వచ్చింది. అలాగే సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన 'కూలీ' చిత్రంలో కూడా నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ప్రస్తుతం 'సలార్ 2'లో కూడా ఆమె కీలక పాత్రలో నటిస్తున్నారు. నటిగా మాత్రమే కాకుండా గాయని గానూ శ్రుతిహాసన్ తన ప్రతిభను నిరూపించుకున్నారు. ప్రైవేట్ ఆల్బమ్స్‌తో పాటు సినిమాల్లో కూడా అవకాశం దొరికినప్పుడల్లా పాటలు పాడుతూ అభిమానులను అలరిస్తున్నారు. ఇటీవల నాని హీరోగా నటించిన 'హాయ్ నాన్న' సినిమాలో ఆమె ఆలపించిన పాటకు మంచి స్పందన వచ్చింది. ఇక స్పెషల్ సాంగ్స్ విషయంలోనూ శ్రుతిహాసన్ తనదైన శైలిలో మెప్పిస్తున్నారు. ప్రస్తుతం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమాలో ఆమె చేసిన ప్రత్యేక గీతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

'జైలర్ 2'లో హృతిక్ ఎంట్రీ?

వేద న్యూస్ డెస్క్:

సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'జైలర్ 2'పై మరో ఆసక్తికర వార్త కోలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఈ సీక్వెల్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొనగా.. ఇప్పుడు బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ ప్రత్యేక పాత్రలో కనిపించే అవకాశముందన్న వార్త మరింత ఉత్కంఠను పెంచుతోంది. తమిళ సినీ వర్గాల సమాచారం ప్రకారం.. మొదట ఈ ప్రత్యేక పాత్ర కోసం బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం ఆయన 'కింగ్' సినిమా చిత్రీకరణలో బిజీగా ఉండటంతో ఆ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఇప్పుడు దర్శక నిర్మాతల దృష్టి హృతిక్ రోషన్‌పై పడినట్లు కోలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇక 'జైలర్' తొలి భాగం సాధించిన సంచలన విజయం తెలిసిందే. రజనీకాంత్ నటన, నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కించిన మాస్ యాక్షన్ శైలి ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా ముత్తువేల్ పాండియన్ పాత్రలో రజనీకాంత్ చూపించిన స్టైల్, యాక్షన్ సన్నివేశాలు అభిమానులను ఉర్రూతలూగించాయి. ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించిన ఈ చిత్రం రజనీకాంత్ కెరీర్‌లో మరో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు అదే కథను మరింత విస్తృతంగా కొనసాగిస్తూ 'జైలర్ 2' తెరకెక్కుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రంలో కూడా భారీ తారాగణం కనిపించనున్నట్లు సమాచారం. రజనీకాంత్‌తో పాటు మిథున్ చక్రవర్తి, విద్యాబాలన్, ఎస్.జె. సూర్య, సూరజ్ వెంజారమూడు కీలక పాత్రల్లో నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే తొలి భాగంలో ప్రత్యేక పాత్రలతో ఆకట్టుకున్న మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ కూడా ఈసారి తమ పాత్రలను కొనసాగించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. భారీ వ్యయంతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని 2026 సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం చిత్రానికి సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయని తెలుస్తోంది. ఇదిలా ఉంటే రజనీకాంత్ ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. కమల్ హాసన్ నిర్మాణ సంస్థ నిర్మించనున్న 'తలైవర్ 173' చిత్రంలో కూడా ఆయన నటించనున్నారు. ఈ చిత్రానికి దర్శకుడిగా పలువురు పేర్లు వినిపిస్తున్నప్పటికీ.. చివరకు ఎవరు దర్శకత్వం వహిస్తారన్నది ఇంకా స్పష్టత రాలేదు. మరోవైపు రజనీకాంత్ కమల్ హాసన్ కలయికలో నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో ఓ భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్ కూడా చర్చల్లో ఉంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌పై సినీ అభిమానుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది.

ఆహాలో సచిన్ జీవితం

వేద న్యూస్ డెస్క్:

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ జీవిత కథ ఆధారంగా రూపొందిన 'సచిన్: ఏ బిలియన్ డ్రీమ్స్' చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకులకు ఓటీటీలో అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ తెలుగు డిజిటల్ వేదిక ఆహా ఈ చిత్రాన్ని మే 28 నుంచి ప్రసారం చేయడం ప్రారంభించింది. థియేటర్లలో మంచి ఆదరణ పొందిన ఈ చిత్రం ఇప్పుడు కుటుంబ ప్రేక్షకులను మరోసారి భావోద్వేగానికి గురిచేస్తోంది. సచిన్ చిన్ననాటి నుంచి ప్రపంచ క్రికెట్‌లో అగ్రస్థానానికి చేరుకున్న ప్రయాణాన్ని ఈ చిత్రంలో ఎంతో హృద్యంగా చూపించారు. చిన్న వయసులోనే క్రికెట్‌పై అతనికి ఏర్పడిన ఆసక్తి, కఠినమైన సాధన, అంతర్జాతీయ క్రికెట్‌లో ఎదుర్కొన్న ఒత్తిళ్లు, విజయాలు, వైఫల్యాలు అన్నింటినీ కళ్లకు కట్టినట్లు ఆవిష్కరించారు. 1983లో భారత జట్టు ప్రపంచకప్ గెలిచిన తర్వాత సచిన్‌లో కలిగిన ప్రేరణ నుంచి 2011లో ప్రపంచకప్ గెలిచే వరకు జరిగిన ప్రయాణం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో సచిన్ కుటుంబ సభ్యులు పంచుకున్న అనుభవాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భార్య అంజలి, సోదరుడు అజిత్ టెండూల్కర్ చెప్పిన ఎన్నో భావోద్వేగ సంఘటనలు అభిమానులను కదిలిస్తున్నాయి. అలాగే మహేంద్రసింగ్ ధోనీ, విరాట్ కోహ్లీ, వీరేంద్ర సెహ్వాగ్, సౌరవ్ గంగూలీ వంటి దిగ్గజ క్రికెటర్లు కూడా సచిన్‌తో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ అందించిన నేపథ్య సంగీతం మరింత బలం చేకూర్చింది. ముఖ్యంగా సచిన్ వీడ్కోలు ప్రసంగం, ప్రపంచకప్ సంబరాల సన్నివేశాల్లో సంగీతం ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తోంది. క్రికెట్ అభిమానులకు మాత్రమే కాకుండా ప్రతి కుటుంబం తప్పక చూడాల్సిన ప్రేరణాత్మక చిత్రంగా ఇది నిలుస్తోంది. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఇంట్లోనే ఈ జీవిత గాథను ఆస్వాదించే అవకాశం పొందుతున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073